

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:115 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 16-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

నాకు ఆకలి కావాలి
శ్రమ లేని శరీరానికిఅలసటెక్కడిది
అలసట లేని దేహానికి ఆకలెక్కడిది.
వేళకు తింటున్నము
పనీ పాట లేక పంటున్న
ముయంత్రము వలె ఉంటున్నము.
సౌకర్యాలు సగం రోగాల తెస్తున్నవి.
అలవాట్లు అంటురోగాలై పంటున్నవి.
కడుపు మాడి ఆకలి కాకరేగితే
ఆకలి కేకలు పేగుల అరుపులు
క్షుదు బాద అనుభవించిన కడుపు
రుచి పసి శుభ్రత చూడని నోరు
స్థలము కులము అంతస్థులు చూడని
ఆకలి చూసిఎన్నాళ్ళయిందో
ఎవరికి వారే నెమరు వేస్కోండి.
మొక్కులతో ఒక్కపాద్దులంటూ
చిరుతిండ్లతో కడుపులు నింపే భక్తులారా !
కరిక ఉపవాసంకాయానికి మేలు చేస్తుంది.
ఆకలి అలసట తెస్తుంది,ఆయాసానికి
దూరముంచుతుంది.
ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

మీ .... రాజిరెడ్డి శీలం
ఇనుగుర్తి..



కరువు నివారణకు రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వండి



- ప్రధాని మోదీని కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాం
- ఎల్‌నినోతో తగ్గిన వర్షపాతం.. రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి
- తుమ్మిడిహెట్టి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టులకు అనుమతులు కోరిన సీఎం
- గోదావరి-కావేరి అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం వాటా ఇవ్వాలని ప్రతిపాదన
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, ఖేలో ఇండియా ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం



ప్రజా వాయిస్, న్యూఢిల్లీ: తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఢిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని నివాసంలో మోదీతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టులు, కేంద్ర నిధుల కేటాయింపులు తదితర అంశాలపై ప్రధానితో చర్చించారు.ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిపోయిందని, ఇప్పటికే రాష్ట్రంలోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చిందని సీఎం వివరించారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు తాగునీటి సమస్యను నివారించేందుకు తక్షణమే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ అందించాలని కోరారు.

పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వండి

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంతర్రాష్ట్ర వివాదాలు, కేంద్ర అనుమతుల జాప్యాన్ని కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని, ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కింద ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం అనుమతులు ఇప్పించడంతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) వచ్చేలా సహకరించాలని కోరారు.

మిగతా 2లో

ట్రయల్ రూమ్‌లో 18 ఏళ్ల యువతి దారుణ హత్య

- మోతీ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని వస్త్ర దుకాణంలో ఘటన
- షబ్నమ్‌ను ట్రయల్ రూమ్‌లోకి తీసుకెళ్లిన సూరజ్
- హత్య అనంతరం బయట నుంచి తలుపుకు గడియ పెట్టి పరారీ
- సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి కోసం పోలీసుల గాలింపు

2 లో



ఖైదీల కోసం జైల్లోనే ప్రభుత్వ ఐటీఐ

- జైళ్ల శాఖ చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు
- తొమ్మిది వృత్తి విద్యా కోర్సులకు కేంద్రం ఆమోదం
- ఒక్కో బ్యాచ్‌లో 200 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక
- ఇప్పటికే కోర్సుల్లో చేరేందుకు 200 మంది ఖైదీల ఆసక్తి
- విడుదల తర్వాత ఉపాధి, స్వయం ఉపాధికి బాటలు



ప్రజా వాయిస్, హైదరాబాద్: ఖైదీల పునరావాసం, నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ జైళ్ల శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు, సొంతంగా ఉపాధి పొందేందుకు చర్లపల్లి సెంట్రల్ జైలు ప్రాంగణంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను ఏర్పాటు చేసింది. జైళ్ల శాఖ పరిధిలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ శిక్షణ సంస్థను ప్రారంభించారు. జైళ్లను కేవలం నిర్బంధ కేంద్రాలుగా కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, పునరావాస కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

తొమ్మిది కోర్సుల్లో శిక్షణ

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ కింద తొమ్మిది ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చేందుకు భారత ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఫిట్టర్, పెయింటర్, వీవింగ్ టెక్నీషియన్, వుడ్ వర్క్ టెక్నీషియన్, వెల్డర్, డ్రెస్ మేకింగ్, హౌస్ కీపర్, హార్టికల్చర్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో బ్యాచ్‌లో 200 మందికి శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే సుమారు 200 మంది ఖైదీలు ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. శిక్షణ అందించేందుకు తొమ్మిది మంది నైపుణ్యం కలిగిన శిక్షకులను కూడా అందుబాటులో ఉంచారు.

ఇప్పటికే విద్యాభివృద్ధికి చర్యలు

ఖైదీలకు విద్యా అవకాశాలు కల్పించడంలోనూ జైళ్ల శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇటీవల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీతో ఒప్పందం చేసుకున్న అనంతరం మరో 70 మంది ఖైదీలు పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరారు. విద్యార్థులు పూర్తి చేసిన

మిగతా 2లో

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ గుర్తించవు



- కేటీఆర్
- గాంధీ కుటుంబానికి బాడీగార్డులా సీఎం వ్యవహరిస్తున్నారంటూ ఎద్దేవా
- రాహుల్ బైక్ వెనుక మంత్రులు నౌకర్లలా పరుగులు తీశారని వ్యాఖ్య
- అమిత్ షా చెప్పులు మోసిన బీజేపీ నేతల తీరుపైనా విమర్శలు
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని జాతీయ పార్టీలు తాకట్టు పెడుతున్నాయని ఆగ్రహం
- ప్రభుత్వ కార్యక్రమాలను రాజకీయ వేదికలుగా మార్చడంపై అభ్యంతరం

2 లో

హరీశ్‌రావు ఇంటికి కేసీఆర్

- కేటీఆర్, హిమాన్ష్ కూడా రాక
- హరీశ్‌రావు తండ్రి సంవత్సరీక కార్యక్రమానికి హాజరు
- తన్నీరు సత్యనారాయణరావు చిత్రపటానికి కేసీఆర్ నివాళులు
- కుమారుడు హిమాన్ష్‌తో కలిసి వచ్చిన కేటీఆర్
- హరీశ్‌రావు కుటుంబ సభ్యులతో నేతల ఆత్మీయ పలకరింపులు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు, వీడియోలు



కుటుంబ కార్యక్రమానికి కేసీఆర్ హాజరు

ప్రజా వాయిస్, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నివాసానికి వెళ్లారు. హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివారం నిర్వహించిన ఈ కుటుంబ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తన కుమారుడు హిమాన్ష్‌తో కలిసి హాజరయ్యారు. ఒకే కార్యక్రమంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కనిపించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

తన్నీరు సత్యనారాయణరావు మరణించి ఏడాది పూర్తయిన సందర్భంగా కుటుంబ సభ్యులు సంవత్సరీక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్.. సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హరీశ్‌రావు కుటుంబ సభ్యులను పలకరించి కొంతసేపు వారితో గడిపారు. హరీశ్‌రావు కేసీఆర్‌కు మేనల్లుడు కావడంతో కుటుంబపరంగానూ ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలో సత్యనారాయణరావు మరణించినప్పుడు కూడా కేసీఆర్ ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హిమాన్ష్‌తో కలిసి వచ్చిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మిగతా 2లో

బీఆర్ఎస్ అక్రమాలను కవిత బయటపెడుతున్నారు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన పరిణామాలను కవిత స్వయంగా చూశారు
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మల్లన్నసాగర్ నుంచి కాలువ ఉందంటూ ఆరోపణలు
- ప్రజాధనం దుర్వినియోగంపై కవిత వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశం
- ప్రగతిభవన్, ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ఆమెకు తెలుసు
- తమ ప్రభుత్వం 4.50 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసిందని వెల్లడి

2 లో



బీఆర్ఎస్‌ను ఫాంహౌస్‌కే పరిమితం చేశారు

- బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు
- దోచుకోవడమే డిగ్నిటీ ఆఫ్ ఆఫీసా? అంటూ ప్రశ్న
- ప్రజలను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడమేనా మీ విలువలు?
- గురువుల కాళ్లు మొక్కడం మా సంస్కారం.. బండి సంజయ్
- రాహుల్ గాంధీ చెల్లని రూపాయి అంటూ విమర్శలు
- రాహుల్ ప్రధాని అయితే దేశం ముక్కలవుతుందని వ్యాఖ్య



ప్రజా వాయిస్, హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దోచుకోవడమే డిగ్నిటీ ఆఫ్ ఆఫీసా? అంటూ ప్రశ్నించారు. ప్రజలను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యలకు కారణమయ్యే విధానాలేనా రాజకీయ విలువలంటూ నిలదీశారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ పాలన, ఆ పార్టీ నేతల వ్యవహారశైలిపై ఘాటు విమర్శలు చేశారు.

అవేనా మీ రాజకీయ విలువలు?

భార్యాభర్తల బెడ్‌రూమ్ సంభాషణలను వినడం కూడా డిగ్నిటీ ఆఫ్ ఆఫీసా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులు, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యలకు పురిగొల్పడం ఏ విధమైన పాలనా విలువలని నిలదీశారు. సర్పంచులు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వారిని ఆత్మహత్యల దిశగా నెట్టడం డిగ్నిటీ ఆఫ్ ఆఫీసా? అంటూ విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్

మిగతా 2లో

కరువు నివారణకు రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

సీతమ్మసాగర్ బ్యారేజీకి పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రతిపాదించారు.

గోదావరి-కావేరి అనుసంధానంలో సగం వాటా

గోదావరి–కావేరి నదుల అనుసంధాన ప్రక్రియలో తెలంగాణకు 50 శాతం నీటి వాటా కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానిని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలగకుండా నీటి కేటాయింపులు ఉండాలని స్పష్టం చేసినట్లు సమాచారం. పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో కేంద్రం చొరవ తీసుకుంటే తెలంగాణలో సాగునీటి అవసరాలు తీరడంతో పాటు వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని వివరించారు.

రెండు కీలక కార్యక్రమాలకు ఆహ్వానం

రాష్ట్రంలో నిర్వహించనున్న రెండు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. అలాగే డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా రాష్ట్రానికి ఆర్థిక సాయం, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, జాతీయ స్థాయి కార్యక్రమాలకు ప్రధాని హాజరు వంటి పలు అంశాలపై ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఖైదీల కోసం జైల్లోనే ప్రభుత్వ ఐటీఐ

మొదటి పేజీ తరువాయి

ఖైదీలను ఐటీఐ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహిస్తామని డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు. విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను అందించడం ద్వారా విడుదల తర్వాత ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

గౌరవప్రదమైన జీవితానికి నైపుణ్యాలు

శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన మాట్లాడుతూ.. స్థిరమైన జీవనోపాధి కల్పించడంలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గుర్తింపు పొందిన ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన ఖైదీలకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని వివరించారు. ఖైదీలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆచరణాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, జైలు నుంచి విడుదలైన తర్వాత ఆత్మ గౌరవంతో కూడిన జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. మొత్తంగా ఖైదీలలో పరివర్తన తీసుకురావడంతో పాటు వారిని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు చర్లపల్లి ఐటీఐ కీలక వేదికగా నిలవనుంది.

ట్రయల్ రూమ్‌లో 18 ఏళ్ల యువతి దారుణ హత్య

ప్రజా వాయిస్, న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మహిళల భద్రతపై మరోసారి ఆందోళన కలిగించే ఘటన చోటుచేసుకుంది. పశ్చిమ దిల్లీలోని మోతీ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న 18 ఏళ్ల షబ్నమ్ దారుణ హత్యకు గురైంది. మాట్లాడాలని ట్రయల్ రూమ్‌లోకి తీసుకెళ్లిన వ్యక్తి పదునైన ఆయుధంతో ఆమె గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకోగా, ఆదివారం నిందితుడు సూరజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

మాట్లాడాలంటూ లోపలికి తీసుకెళ్లి..

షబ్నమ్‌కు సూరజ్‌తో గతంలో స్నేహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే కొంతకాలంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. శనివారం సాయంత్రం షబ్నమ్ విధులు ముగించుకునే సమయంలో దుకాణానికి వచ్చిన సూరజ్.. ఆమెను మాట్లాడాలని ట్రయల్ రూమ్‌లోకి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడే పదునైన ఆయుధంతో ఆమెపై దాడి చేసి గొంతు కోసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రాత్రి 9 గంటలకు వెలుగులోకి..

రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసేందుకు సిద్ధమైన సిబ్బంది ట్రయల్ రూమ్‌లను తనిఖీ చేయగా.. షబ్నమ్ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు.

నిందితుడు అరెస్ట్.. కారణాలపై విచారణ

సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు నిందితుడిని గుర్తించి గాలింపు చేపట్టారు. తొలుత పరారీలో ఉన్న సూరజ్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు తాజా సమాచారం. వ్యక్తిగత సంబంధాల్లో తలెత్తిన విభేదాలు, ఏకపక్ష ప్రేమ ఈ హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే అసలు కారణాన్ని నిర్ధారించేందుకు నిందితుడిని విచారిస్తున్నారు.

మహిళల భద్రతపై మరోసారి ప్రశ్నలు

దేశ రాజధానిలోనే పని ప్రదేశంలో యువతి హత్యకు గురికావడం కలకలం రేపుతోంది. మహిళల భద్రత కోసం కఠిన చట్టాలు అమలులో ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మహిళలకు రక్షణ కల్పించడంలో మరింత అప్రమత్తత అవసరమని, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

22 గంటల అంతరిక్ష ప్రయాణం.. లాంచ్ టవర్ చేతికి చిక్కిన స్టార్‌షిప్!

- స్టార్‌షిప్ 15వ పరీక్షా ప్రయోగంలో కీలక విజయం
- 265 కిలోమీటర్ల ఎత్తులో భూమి చుట్టూ పరిభ్రమణ
- 26 స్టార్‌లింక్ వి3 ఉపగ్రహాల విడుదల
- 22.5 గంటల తర్వాత భూమికి తిరిగొచ్చిన స్టార్‌షిప్
- చాప్‌స్టిక్స్‌తో నౌకను పట్టుకున్న లాంచ్ టవర్ యంత్రాంగం

ప్రజా వాయిస్, అంతర్జాతీయ డెస్క్: అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో స్పేస్‌ఎక్స్ మరో సరికొత్త మైలురాయిని అధిగమించింది. భూమి నుంచి అంతరిక్షంలోకి దూసుకెళ్లిన స్టార్‌షిప్ నౌకను తిరిగి భూమికి తీసుకొచ్చి, లాంచ్ టవర్‌కు అమర్చిన భారీ యాంత్రిక చేతులతో విజయవంతంగా పట్టుకుంది. నవంబర్ 13న టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి ప్రారంభమైన 15వ పరీక్షా ప్రయోగం.. నవంబర్ 14న స్టార్‌షిప్ క్యాచ్‌తో చరిత్ర సృష్టించింది. అంతరిక్షంలోకి వెళ్లి తిరిగొచ్చిన స్టార్‌షిప్‌ను లాంచ్ టవర్ చేతులు పట్టుకోవడం ఇదే తొలిసారి.

14 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు

ఈ ప్రయోగంలో స్టార్‌షిప్ పైభాగమైన షిప్-42 సుమారు 275 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి చేరింది. దాదాపు 14 సార్లు భూమి చుట్టూ పరిభ్రమించింది. ఈ క్రమంలో 26 స్టార్‌లింక్ వి3 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సుమారు 22.5 గంటల అంతరిక్ష ప్రయాణం అనంతరం భూమికి తిరుగు ప్రయాణాన్ని ప్రారంభించింది. నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, టెక్సాస్‌లోని స్టార్‌బేస్‌కు చేరుకుంది.

చాప్‌స్టిక్స్‌తో పట్టుకున్న నౌక

స్టార్‌షిప్ తిరిగి వచ్చిన సమయంలో లాంచ్ టవర్‌కు అమర్చిన రెండు భారీ యాంత్రిక చేతులు (మెకానికల్ ఆర్మ్స్) నౌకను గాల్లోనే పట్టుకున్నాయి. ఈ వినూత్న సాంకేతిక విధానాన్ని 'చాప్‌స్టిక్స్ క్యాచ్'గా పిలుస్తారు. రాకెట్‌ను తిరిగి భూమిపై దింపేందుకు ప్రత్యేక ల్యాండింగ్ కాళ్లు అవసరం లేకుండా, టవర్ చేతుల సహాయంతోనే పట్టుకోవడం స్పేస్‌ఎక్స్ ప్రయోగాల్లో కీలక పరిణామం. భవిష్యత్తులో రాకెట్లను వేగంగా తిరిగి వినియోగించుకునేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడనుంది.

బూస్టర్ క్యాచ్ మాత్రం విఫలం

ఈ ప్రయోగంలో మరో కీలక అంశం సూపర్ హెవీ బూస్టర్-22. స్టార్‌షిప్ నుంచి విడిపోయిన మొదటి దశ బూస్టర్‌ను కూడా లాంచ్ టవర్ చేతులతో పట్టుకోవాలని స్పేస్‌ఎక్స్ ప్రణాళిక రూపొందించింది. అయితే బూస్ట్‌బ్యాక్ సమయంలో ఇంధన పరిమాణం తగ్గడంతో ప్రయాణ ప్రణాళికలో అంతరాయం ఏర్పడింది. దీంతో బూస్టర్‌ను టవర్ వద్దకు తీసుకురాకుండా గల్ఫ్ ఆఫ్ మెక్సికో వైపు మళ్లించారు. అనంతరం దాని ప్రయోగాన్ని ముగించారు. ఫలితంగా రెండు భాగాలను ఒకే ప్రయోగంలో పట్టుకోవాలన్న లక్ష్యం నెరవేరలేదు.



పూర్తి పునర్వినియోగ రాకెట్ల దిశగా అడుగు

స్టార్‌షిప్‌ను పూర్తిగా పునర్వినియోగించగల రాకెట్‌గా అభివృద్ధి చేయడమే స్పేస్‌ఎక్స్ ప్రధాన లక్ష్యం. ఒకే ప్రయోగ వాహనాన్ని తిరిగి భూమికి తీసుకొచ్చి, తక్కువ సమయంలోనే మరో ప్రయోగానికి సిద్ధం చేయగలిగితే అంతరిక్ష ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. చంద్రుడిపై మానవుల ల్యాండింగ్, భవిష్యత్తులో అంగారక గ్రహ యాత్రలకు కూడా ఈ సాంకేతికత కీలకం కానుంది. బూస్టర్ క్యాచ్ విఫలమైనప్పటికీ, స్టార్‌షిప్‌ను విజయవంతంగా పట్టుకోవడం అంతరిక్ష రంగంలో చారిత్రక విజయంగా నిలిచింది.

సీరియల్స్‌లో ఛాన్స్‌ల పేరుతో మహిళకు వేధింపులు

- టీవీ సీరియల్స్‌లో అవకాశాలు ఇప్పిస్తానంటూ పరిచయం
- యూట్యూబ్ ద్వారా డబ్బులు సంపాదించవచ్చని నమ్మించిన నిందితుడు
- సన్నిహితంగా ఉంటూ మహిళ అశ్లీల చిత్రాలు తీసినట్లు ఆరోపణలు
- శారీరక సంబంధం కోసం ఒత్తిడి.. నిరాకరించడంతో బ్లాక్‌మెయిల్
- జూబ్లీహిల్స్ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు.. కేసు నమోదు



ప్రజా వాయిస్, హైదరాబాద్:టీవీ సీరియల్స్‌లో అవకాశాలు ఇప్పిస్తానంటూ ఓ మహిళకు పరిచయమైన వ్యక్తి, ఆ తర్వాత ఆమెను వేధింపులకు గురిచేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. శారీరక సంబంధం కోసం ఒత్తిడి చేయడంతో పాటు, అశ్లీల చిత్రాలతో బ్లాక్‌మెయిల్ చేసి, చంపేస్తానంటూ బెదిరించినట్లు బాధితురాలు ఆరోపించింది. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిచయం పెంచుకుని వేధింపులు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన మహిళకు కాళిదాస్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. టీవీ సీరియల్స్‌లో అవకాశాలు ఇప్పిస్తానని, యూట్యూబ్ ద్వారా డబ్బులు సంపాదించేలా చేస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమెతో సన్నిహితంగా మెలుగుతూ, ఆమెకు సంబంధించిన అశ్లీల చిత్రాలను తీసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిరాకరించడంతో బ్లాక్‌మెయిల్

తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలంటూ కాళిదాస్ మహిళపై ఒత్తిడి తీసుకొచ్చాడు. అందుకు ఆమె నిరాకరించడంతో తీసిన అశ్లీల చిత్రాలను బంధువులకు పంపిస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా సోషల్ మీడియాలో ఫొటోలు పెడతానని, చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిపింది.

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు కాళిదాస్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారు. మహిళను బెదిరించేందుకు ఉపయోగించిన ఆధారాలు, అశ్లీల చిత్రాల వ్యవహారంపై వివరాలు సేకరిస్తున్నారు.

హరీశ్‌రావు ఇంటికి కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

కేటీఆర్ కూడా ఈ కార్యక్రమానికి హాజరై సత్య నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు. తన కుమారుడు హిమాన్షును వెంట తీసుకొచ్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు కుమారుడితో కేటీఆర్, హిమాన్షు సరదాగా మాట్లాడుతున్న దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఆత్మీయ సంభాషణలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఒకే చోట ముగ్గురు కీలక నేతలు

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఒకే కార్యక్రమంలో పాల్గొనడం బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ముగ్గురు ముఖ్య నేతలు ఒకే చోట కనిపించడంతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఈ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచుకుంటున్నారు. అయితే ఇది పూర్తిగా కుటుంబానికి సంబంధించిన సంవత్సరీక కార్యక్రమం కావడం గమనార్హం. రాజకీయ ప్రాధాన్యత కంటే కుటుంబ అనుబంధాలు, ఆత్మీయతకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది.



తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ గుర్తించవు

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కేవలం భౌగోళిక ప్రాంతం కాదని, అది ఆత్మగౌరవ ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు ఏనాడూ గుర్తించలేదని, వాటికి ఈ ప్రాంత ప్రజల మనోభావాలు ఎప్పటికీ అర్థం కావని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతల వ్యవహారశైలిపై సామాజిక మాధ్యమం వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు.

రాహుల్ వెనుక మంత్రుల పరుగులు

హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరును కేటీఆర్ తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి, మంత్రులుగా ఉన్నవారు తమ పదవుల హుందాతనాన్ని కాపాడుకోవాలని వ్యాఖ్యానించారు.

మహేశ్ గౌడ్ వివరణ

కేటీఆర్ విమర్శలపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. తాను బైక్‌పై వెళ్తుండగా వాహనం స్కిడ్ అయిందని, దీనిని గమనించిన రాహుల్ గాంధీ తనను పక్కకు పిలిచారని వివరించారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉండటం వల్లే ఆయన పక్కన పరుగెత్తగలిగానని, అలా చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

బీజేపీ నేతలపైనా విమర్శలు

కేవలం కాంగ్రెస్‌నే కాకుండా బీజేపీ రాష్ట్ర నాయకత్వంపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాదాలకు నమస్కరించడం, ఆయన చెప్పులు మోయడం వంటి ఘటనలను ప్రస్తావించారు. ఇవి సిగ్గుచేటైన చర్యలని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేలా జాతీయ పార్టీల నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పదవులు పొందిన నాయకులు వాటికి తగిన హుందాతనం, గౌరవం ప్రదర్శించాలని హితవు పలికారు.



ప్రభుత్వ వేదికలపై రాహుల్ హోదా ఏమిటి?

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపైనా బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగం పట్టుకుని నీతులు చెప్పే కాంగ్రెస్ నేతలు ముందుగా రాజ్యాంగ విలువలు, ప్రొటోకాల్‌ను గౌరవించాలని పేర్కొంది. ఏ హోదాలో, ఏ నిబంధనల ప్రకారం రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీలను ప్రకటిస్తున్నారని ప్రశ్నించింది. భారత్ సమ్మిట్ ముగింపు సభతో పాటు ఇతర అధికారిక వేదికలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చడంపై అభ్యంతరం తెలిపింది. దీంతో తెలంగాణ ఆత్మగౌరవం, రాజకీయ ప్రొటోకాల్ అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

బీఆర్ఎస్‌ను ఫాంహౌస్‌కే పరిమితం చేశారు

మొదటి పేజీ తరువాయి

అంటే ఏమిటో తెలుసని, అందుకే బీఆర్ఎస్‌ను ఫాంహౌస్‌కే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.

గురువుల కాళ్లు మొక్కడం మా సంస్కారం

తాను తన గురువుల కాళ్లు మొక్కుతానని బండి సంజయ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల్లా ఇతరుల కొంపలు ముంచే విలువలను తమ గురువులు నేర్పలేదన్నారు. "మీ లాగా చెప్పులు ఎత్తుకుపోయేవాడిని కాదు.. గురువు కాళ్లను గుంజేవాళ్లం కాదు. మావి సంస్కారం, విలువలతో కూడిన రాజకీయాలు" అంటూ వ్యాఖ్యానించారు. గురువులను గౌరవించడం తమ సంప్రదాయమని పేర్కొన్నారు.

రాహుల్‌పై విమర్శల దాడి

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కూడా బండి సంజయ్ లక్ష్యంగా చేసుకున్నారు. రాహుల్ గాంధీ చెల్లని రూపాయి అంటూ ఎద్దేవా చేశారు. విదేశాల్లోని చెల్లని రూపాయలను తీసుకొచ్చి సమ్మిట్ నిర్వహిస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాని అయ్యే అర్హత రాహుల్‌కు లేదని విమర్శించారు. ఒకవేళ పొరపాటున ఆయన ప్రధాని అయితే దేశం ముక్కలవడం ఖాయమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి.



బీఆర్ఎస్ అక్రమాలను కవిత బయటపెడుతున్నారు

ప్రజా వాయిస్, హైదరాబాద్:బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ కుమార్తె, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా బయటపెడుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను కవిత దగ్గరుండి చూశారని, ఇప్పుడు ఆమె చేస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. కవిత వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు.



కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాలువ ఉందా?

మల్లన్నసాగర్ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాలువ ఉందంటూ కవిత చేసిన వ్యాఖ్యలను ఆది శ్రీనివాస్ ప్రస్తావించారు. తన తండ్రి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ కవిత చేస్తున్న ఆరోపణలు సంచలనంగా మారాయని అన్నారు. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ప్రగతిభవన్, ఫామ్‌హౌస్‌లో జరిగిన విషయాలను కవిత స్వయంగా చూశారని వ్యాఖ్యానించారు.

హరీశ్‌రావు సమాధానం చెప్పాలి

బీఆర్ఎస్ పాలనలో జరిగినట్లు కవిత ప్రస్తావిస్తున్న అక్రమాలపై ఆ పార్టీ నేతలు మౌనం వీడాలని ఆది శ్రీనివాస్ అన్నారు. గతంలో ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన హరీశ్‌రావు ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సొంత పార్టీ కుటుంబం నుంచే వస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకత్వం ఏం సమాధానం చెబుతుందో చూడాలని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

4.50 లక్షల కొత్త పింఛన్లు మంజూరు

మరోవైపు తమ ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4.50 లక్షల కొత్త పింఛన్లను మంజూరు చేసిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే ప్రజా సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు.



2028 ఎన్నికల్లో బీసీలదే అధికారం

- 80 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తాం: జాజుల

ప్రజావాయిస్/తాండూరు:2028 ఎన్నికల్లో తెలంగాణలో 80 మంది బీసీ ఎమ్మెల్యేలను గెలిపించుకుని రాజకీయ అధికారం సాధిస్తామని బీసీ సంఘం నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తాండూరులోని ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీసీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనానికి ముందు విలియం మూన్ చౌరస్తా నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు బీసీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు.అన్ని రాజకీయ పార్టీలు బీసీ రాజకీయ పాలసీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తాండూరులో బీసీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



అంతర్జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న శంకరన్న

- తాండూరుకు అంతర్జాతీయ గుర్తింపు
- 15 ఏళ్ల సేవలకు గౌరవం

ప్రజా వాయిస్/తాండూరు తాండూరు పట్టణానికి చెందిన శ్రీ సాయిపుత్రా హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత శంకర్ యాదవ్‌కు అంతర్జాతీయ సేవారత్న అవార్డు లభించింది. న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తాండూరు ప్రాంతంలో 15 ఏళ్లుగా అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యత పెంచిందని శంకర్ యాదవ్ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాప్ దగ్ధం

- రెండు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం
- కన్నీటి పర్యంతమైన షాప్ యజమాని



ప్రజా వాయిస్, గార్ల :విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఓ చిరు వ్యాపారి జీవితాన్ని చిన్నాభిన్నం చేసింది. కష్టపడి సంపాదించి, కుటుంబ పోషణకు ఆధారంగా నడుపుకుంటున్న టైలర్ షాప్ అగ్నికి ఆహుతి కావడంతో యజమాని కన్నీరుమున్నీరుగా విలపించాడు.గార్ల మండల కేంద్రంలోని మెయిన్ బజార్‌లో ఉన్న రాజా టైలర్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి దుకాణం పూర్తిగా దగ్ధమైనట్లు షాప్ యజమాని బాలు తెలిపారు. మంటలు వేగంగా వ్యాపించడంతో షాపులోని కుట్టు మిషన్లు, దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయి షాప్ మొత్తం బూడిదగా మారినట్లు పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి నడుపుకుంటున్న దుకాణం కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో బాలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. జీవనోపాధికి ఆధారమైన షాప్ పూర్తిగా కాలిపోవడంతో తన కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక కన్నీటి పర్యంతమయ్యాడు.చిరు వ్యాపారిపై ప్రకృతి విపత్తులా విరుచుకుపడిన ఈ అగ్నిప్రమాదం స్థానికంగా తీవ్ర ఆవేదన కలిగించింది. ప్రభుత్వం, దాతలు స్పందించి తనను ఆదుకోవాలని బాధితుడు బాలు వేడుకుంటున్నాడు...

"శ్రీ రక్షను" రక్షించేది ఎవరు?

- 60 అడుగుల రోడ్డుకు ఎసరు.. నిబంధనలకు తూట్లు!
- అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా?
- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులున్నా స్పందించని టౌన్ ప్లానింగ్ అధికారులు!
- ప్రజల రహదారికి భరోసా కల్పించేది ఎవరు?
- శ్రీరక్ష నిర్మాణంపై విచారణకు కలెక్టర్ ఆదేశిస్తారా?



ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: వికారాబాద్ పట్టణంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని శ్రీరక్ష సిటీ అపార్ట్‌మెంట్ నిర్మాణంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉన్న 60 అడుగుల రోడ్డును ఆనుకుని నిర్మాణాలు చేపడుతున్నారని, రోడ్డు విస్తీర్ణం, సెట్‌బ్యాక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ ఇదే అంశంపై ప్రజావాయిస్ దినపత్రికలో ఆధారాలతో కథనం ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారుల నుంచి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

60 అడుగుల రోడ్డుకు సెట్ బ్యాక్ ఎక్కడ?

వికారాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 16/3లో సుమారు ఎకరన్నర విస్తీర్ణంలో భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణం కొనసాగుతోంది. ఈ నిర్మాణానికి 2024 జూన్‌లో డీటీసీపీ అనుమతులు పొందినట్లు సమాచారం. మూడు బ్లాకులుగా అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపడుతున్నారు. అయితే మాస్టర్ ప్లాన్ ప్రకారం అపార్ట్‌మెంట్ ముందు భాగంలో 60 అడుగుల రోడ్డు ఉండగా, రోడ్డు నుంచి సుమారు మూడు మీటర్ల మేర స్థలం వదిలి నిర్మాణం చేపట్టాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు. కానీ నిబంధనలకు అనుగుణంగా సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ.

లే అవుట్ రోడ్డుకు కూడా ముప్పు?

అపార్ట్‌మెంట్ వెనుక భాగంలో ఎల్‌పీ నంబర్ 71/97 లే అవుట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లే అవుట్‌కు అపార్ట్‌మెంట్‌కు మధ్య సీసీ రోడ్డు కూడా ఉంది. ఈ రోడ్డుకు సంబంధించి ఒకవైపు 23 అడుగులు, మరోవైపు 11 అడుగుల స్థలం వదలడంతో పాటు అదనంగా రెండున్నర మీటర్ల సెట్‌బ్యాక్ వదిలి నిర్మాణం చేపట్టాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

అక్రమ నిర్మాణాలపై గతంలోనే ప్రజావాయిస్ దినపత్రికలో కథనం ప్రచురించినప్పటికీ సంబంధిత మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కలెక్టర్ జోక్యం చేసుకుంటారా?

శ్రీరక్ష సిటీ అపార్ట్‌మెంట్ నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలు, మాస్టర్ ప్లాన్, సెట్‌బ్యాక్ వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. 60 అడుగుల రోడ్డు హద్దులు, లే అవుట్ రోడ్డు విస్తీర్ణం, నిర్మాణ నిబంధనల అమలుపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన రహదారులే ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందిస్తారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై విచారణ జరిపిస్తారా? లేక శ్రీరక్షను రక్షించేది ఎవరు? అన్న ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పాలా?

కుక్కల దాడిలో 11 జీవాలు మృతి

- కుక్కల స్వైర విహారం...
- గ్రామస్తుల ఆందోళన

ప్రజా వాయిస్ | చింతలపాలెం | నవంబర్ 15 సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం తమ్మారం గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారం ప్రజలను, పశుపోషకులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. తాజాగా గ్రామానికి చెందిన చిర్ర రాంబాబు యాదవ్ ఇంటి ఆవరణలోని దొడ్డిలోకి గుంపులుగా చొరబడిన వీధి కుక్కలు దాడి చేసి 11 మేక పిల్లలను చంపాయి. అప్పులు చేసి జీవనోపాధి కోసం మేకలను పెంచుకుంటున్న తమకు ఈ ఘటనతో సుమారు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.గత కొన్ని నెలలుగా తమ్మారం గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. రాత్రి, పగలు తేడా లేకుండా గుంపులుగా తిరుగుతూ ప్రజలను, మూగజీవాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.చిన్నారులు, వృద్ధులకు పొంచి ఉన్న ప్రమాదం: పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం పనులకు వెళ్లే కూలీలు, వృద్ధులపై కుక్కలు దాడికి యత్నిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పెంచుకుంటున్న మేకలు, గొర్రెలు, కోళ్లపై కుక్కలు దాడులు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి:ఈ ఘటనపై పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన చిర్ర రాంబాబు యాదవ్ కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు మరియు స్థానికులు కోరుతున్నారు. అలాగే గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.





అవార్డుల్లో అగ్రస్థానం!

- కూచిపూడి నృత్యంలో సిరి వెన్నెలకు ప్రథమ బహుమతి
- బాల కళారత్న అవార్డు కైవసం



ప్రజా వాయిస్,మిర్యాలగూడ. మిర్యాలగూడ పట్టణానికి చెందిన శ్రీపాద సిరి వెన్నెల కూచిపూడి నృత్యంలో తన ప్రతిభను చాటుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించింది. బాలల దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో గుంటూరులోని అన్నమయ్య కళావేదికలో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది.మంజీరా ఆర్ట్స్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సిరి వెన్నెల ప్రతిభకు న్యాయనిర్ణేతలు ప్రథమ స్థానం కట్టబెట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హెరిటేజ్ అండ్ కల్చర్ డైరెక్టర్ చేతుల మీదుగా ప్రథమ బహుమతితో పాటు బాల కళారత్న అవార్డును అందుకుంది.మిర్యాలగూడలోని సిరిమువ్వ నాట్యాలయంలో నాట్య గురువు కలకొండ రాము వద్ద శిక్షణ పొందుతున్న సిరి వెన్నెల 2020 నుంచి 2026 వరకు హైదరాబాద్, తిరుపతి, గుంటూరు, నల్గొండ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వివిధ నృత్య పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు, అవార్డులు సాధించింది.ఈ సందర్భంగా నాట్య గురువు కలకొండ రాము మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సిరి వెన్నెల గత ఆరేళ్లుగా పేరిని, కూచిపూడి, భరతనాట్యం నేర్చుకుంటూ నృత్య రంగంలో రాణిస్తోందన్నారు. నృత్యంతో పాటు చదువులోనూ మంచి ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు సాధించి మిర్యాలగూడకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సమాధుల పక్కన స్థలంపై కబ్జా కన్ను

- కంటైనర్ తో ఆక్రమణకు స్కెచ్ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయానికి సంబంధించిన భారీ కంటైనర్ ఏర్పాటు
- రాత్రికి రాత్రే స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారంటూ స్థానికుల ఆరోపణ
- కళ్ల ముందే ఆక్రమణ ప్రయత్నం జరుగుతున్నా స్పందించని అధికారులు
- కంటైనర్ తొలగించి స్థలాన్ని కాపాడాలని నివాసితుల డిమాండ్

జావాయిస్||రాజేంద్రనగర్: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు,కబ్జా చేసేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారా.? ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన అధికారుల నిఘా ఎక్కడ.? రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ సాయికృష్ణ కాలనీ,గ్రీన్ సిటీ కాలనీ సరిహద్దు ప్రాంతంలో సమాధులకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంపై ఆక్రమణ ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఐరన్ సామగ్రితో తయారు చేసిన వ్యాపార సముదాయానికి సంబంధించిన కంటైనర్‌ను అక్కడికి తీసుకొచ్చి ఏర్పాటు చేసినట్లు ఆరోపిస్తున్నారు.

కంటైనర్ తో కబ్జాకు కొత్త ఎత్తుగడ?

స్థానికుల వివరాల ప్రకారం.. సమాధుల పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకునే ఉద్దేశంతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపార సముదాయానికి ఉపయోగించే భారీ కంటైనర్‌ను స్థలంలోకి తీసుకొచ్చి ఉంచడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోందని నివాసితులు చెబుతున్నారు.తొలుత కంటైనర్ ఏర్పాటు చేసి, క్రమంగా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

అధికారుల కళ్లు మూసుకున్నాయా.... కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారా?

స్థానికంగా ఆక్రమణ ప్రయత్నం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యత అధికారులదే అయినప్పటికీ,కంటైనర్ ఏర్పాటు వరకు పరిస్థితి చేరడం వారి పర్యవేక్షణ తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆక్రమణ ప్రయత్నాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు.? ఫిర్యాదుల కోసం ఎదురు చూస్తున్నారా.? లేక క్షేత్రస్థాయి పరిశీలన చేయడానికి కూడా సమయం లేదా.? అంటూ స్థానికులు అంటున్నారు.

ఇప్పటికైనా స్పందించాలి...స్థలాన్ని కాపాడాలి

సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెంటనే స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, దాని యాజమాన్య వివరాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అనుమతులు లేకుండా కంటైనర్ ఏర్పాటు చేసినట్లు తేలితే తక్షణమే తొలగించి,ఆక్రమణ ప్రయత్నాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలి. ఆక్రమణ జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ఆక్రమణ ప్రయత్నాన్ని ముందుగానే అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ

- త్రాగు నీటిలో కలుస్తున్న డ్రైనేజీ నీరు



ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 15 : చిలుకూరు మండలం పరిధిలోని ఆర్లగూడెం గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకై త్రాగునీరు వృధాగా పోతుంది పైపులైన్ పగిలిపోవడంతో మీరంతా నేరుగా పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలు కలిసి కలుషితమవుతుంది. గత కొద్ది రోజులుగా సమస్య ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు త్రాగునీరు కోసం ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ఇలా నీరు వృధాగా పోవడంపై స్థానికులు అజాహేన వ్యక్తం చేస్తున్నారు నీటినిలువ కారణంగా పరిసరాలలో అపరిశుభ్రత నెలకొని దోమల బెడద పెరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. సంబంధిత మిషన్ భగీరథ అధికారులు వెంటనే స్పందించి, లీకేజీ మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పేలుడు పదార్థాలు స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

- రూ.9 వేల విలువైన జిలెటిన్ స్టిక్స్ , కార్డెక్స్ , బత్తి వైర్ పట్టివేత.

ప్రజా వాయిస్ భీమదేవరపల్లి.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలు కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వంగర ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎస్సై, సిబ్బందితో కలిసి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, వంగర గ్రామ శివారులోని ఆహార శుద్ధి పరిశ్రమ సమీపంలో అక్రమంగా పేలుడు పదార్థాలు కలిగి ఉన్నట్లు సమాచారం అందింది.దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని అనుమానాస్పదంగా కనిపించిన రూదాని రాముడు (31)ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద ఉన్న అట్టపెట్టెను తనిఖీ చేశారు. అందులో 30 జిలెటిన్ స్టిక్స్, కార్డెక్స్ వైర్, బత్తి వైర్ ఉన్నట్లు గుర్తించారు. వీటి నిల్వకు సంబంధించి లైసెన్సు, అనుమతి పత్రాలు చూపించాలని కోరగా అతడు ఎలాంటి పత్రాలు సమర్పించలేదు.పంచుల సమక్షంలో తనిఖీ చేయగా 30 జిలెటిన్ స్టిక్స్ విలువ రూ.4,500, కార్డెక్స్ వైర్ విలువ రూ.3,000, బత్తి వైర్ విలువ రూ.1,500 కలిపి మొత్తం రూ.9 వేల విలువైన పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఎల్కతుర్తి మండలం గోపాలపూర్‌కు చెందిన కాంట్రాక్టర్ వల్లెపు మధు పనుల నిమిత్తం తాను అక్కడికి వచ్చినట్లు రాముడు తెలిపాడు. ఈ ఘటనలో ఏ1 రూదాని రాముడు, ఏ2 వల్లెపు మధుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు వెల్లడించారు.

బాల కార్మికులపై తనిఖీలు సరే.. వలస కూలీల సంగతేంటి?

- మంథనిలో హోటళ్లు, బేకరీల్లో చైల్డ్ లేబర్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- ఇటుక బట్టీల్లో వలస కార్మికుల పరిస్థితిపై పర్యవేక్షణ ఏదీ?
- బాల కార్మికులు పట్టుబడితే యజమానులపై ఎలాంటి చర్యలు?
- జిల్లా వ్యాప్తంగా ఎంతమంది వలస కూలీలు ఉన్నారు?
- వారి సంక్షేమం, భద్రత బాధ్యత ఎవరిది?

ప్రజా వాయిస్ మంథని మున్సిపాలిటీ పరిధిలో బాల కార్మికుల వినియోగంపై వచ్చిన సమాచారంతో శుక్రవారం చైల్డ్ లేబర్ నిషేధ విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలను తనిఖీ చేసిన అధికారులు ముఖ్యంగా పాత పెట్రోల్ బంక్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై ఉన్న స్వీట్ హౌస్‌లలో విచారణ చేపట్టినట్లు సమాచారం. కాగా, పాత పెట్రోల్ బంక్ ప్రాంతంలోని కొన్ని బేకరీల నిర్వహణపై గతంలోనూ స్థానికుల నుంచి ఆరోపణలు, విమర్శలు వచ్చినట్లు తెలుస్తోంది. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారా? బాల కార్మికులను పనిలో పెట్టుకుంటున్నారా? అవసరమైన అనుమతులు, లైసెన్సులు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బాల కార్మికులు ఉంటే కఠిన చర్యలు తప్పవా?

మంథనిలో నిర్వహించిన తనిఖీల్లో బాల కార్మికులు ఎవరైనా గుర్తించబడ్డారా? గుర్తించినట్లయితే వారి వయస్సు ఎంత? వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేశారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. చట్ట ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను సాధారణంగా ఏ వృత్తిలోనూ పనికి నియమించుకోవడం నిషేధం. 14 నుంచి 18 ఏళ్లలోపు కిశోరులను ప్రమాదకర వృత్తులు, ప్రక్రియల్లో నియమించుకోవడం కూడా నేరమే. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. పునరావృత నేరాలకు మరింత కఠినమైన శిక్షలు ఉంటాయి. బాలలను గుర్తించినప్పుడు వారిని పని నుంచి విముక్తి కల్పించడంతో పాటు పునరావాస చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మంథనిలో జరిగిన తనిఖీల్లో అధికారులు గుర్తించిన వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటుక బట్టీల్లో వలస కూలీల పరిస్థితి ఏమిటి?

బాల కార్మికుల నిర్మూలన కోసం అధికారులు తనిఖీలు చేపట్టడం అభినందనీయమే. అయితే మంథని పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికుల పరిస్థితిపై కూడా ఇదే స్థాయిలో పర్యవేక్షణ ఉండాలనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కుటుంబాలతో సహా వలస వచ్చి ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల వివరాలు అధికారుల వద్ద ఉన్నాయా? అక్కడ బాలలు కూడా పనిచేస్తున్నారా? కార్మికులకు కనీస వేతనాలు, భద్రత, నివాస వసతులు కల్పిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమలు, నిర్మాణ రంగాల్లో ఎంతమంది వలస కార్మికులు పనిచేస్తున్నారు? వారి వివరాలను సేకరించే బాధ్యత ఏ శాఖది? వారి హక్కులకు భంగం కలిగితే స్పందించేది ఎవరు? బాల కార్మికుల గుర్తింపు, వలస కార్మికుల సంక్షేమం, కార్మిక చట్టాల అమలుపై కార్మిక శాఖ, రెవెన్యూ, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. కేవలం హోటళ్లు, బేకరీలకే పరిమితం కాకుండా ఇటుక బట్టీలు, ఇతర పని ప్రదేశాల్లోనూ సమగ్ర తనిఖీలు నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా వలస కార్మికుల సంఖ్యను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత పిల్లలకు పునరావాసం కల్పించాలి. తనిఖీల్లో గుర్తించిన అంశాలు, కేసుల నమోదు, తదుపరి చర్యలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



భక్తుల సందడితో ముగిసిన ధరూర్ మెథడిస్ట్ జాతర!

- మూడు రోజుల పాటు కొనసాగిన ఆధ్యాత్మిక వేడుకలు
- ఆయా రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక ప్రార్థనలు, పూజలతో మార్మోగిన ప్రార్థనా మందిరం
- పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగింపు



ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:వికారాబాద్ జిల్లా ధరూర్ మండలంలో నిర్వహించిన మెథడిస్ట్ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి,ఆయా రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ధరూర్ ప్రాంతం సందడిగా మారింది. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, వివిధ స్టాళ్లు భక్తులను ఆకట్టుకున్నాయి.జాతరలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీస్తు ప్రార్థనా మందిరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

జాతరకు భారీగా భక్తులు తరలివస్తారని ముందస్తుగా అంచనా వేసిన పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు. ఎస్పీ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టారు.మూడు రోజుల పాటు భక్తుల సందడితో కళకళలాడిన ధరూర్ మెథడిస్ట్ జాతర ఉత్సవాలు ఆదివారం భక్తి శ్రద్ధల మధ్య, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీక సదర్ సమ్మేళనం

- సంప్రదాయబద్ధంగా అట్టహాసంగా సదర్ వేడుకలు
- ప్రత్యేక ఆకర్షణగా దున్నపోతుల ప్రదర్శనలు
- ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



జిన్నారం ప్రజావాయిస్ యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు సంప్రదాయ ఉత్సాహం, కోలాహలం నడుమ సాగాయి. యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమానికి సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదర్ వేడుకలు కేవలం పండుగ మాత్రమే కాదని, యాదవుల ఆత్మగౌరవం, ఐక్యత, తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఇటువంటి సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పశుసంపద సంరక్షణలో యాదవుల సేవలు, వ్యవసాయ రంగానికి వారు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని కొనియాడారు.వేడుకల్లో భాగంగా నిర్వహించిన దున్నపోతుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ రకాల అలంకరణలతో ముస్తాబైన దున్నపోతుల విన్యాసాలు, ప్రదర్శనలను తిలకించేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. యాదవ యువత ఉత్సాహం, సంప్రదాయ కళాత్మకతతో సదర్ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ పద్మ వెంకటరామ్ రెడ్డి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, యాదవ సంఘం నాయకులు బీరప్ప, బాల్‌రాజ్, నర్సింలు, బుచ్చయ్య, శ్రీకాంత్ (లడ్డు), బాబు, మురళి, సాయి, యశ్వంత్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలపై యువత ఆసక్తి కలిగి ఉండాలి

- క్రీడలకు వయస్సు అడ్డంకి కాదు
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన మాస్టర్స్ అథ్లెటిక్స్ సంగారెడ్డి జిల్లా సెలెక్షన్స్

పటన్ చెరువు ప్రజావాయిస్ క్రీడలకు వయస్సు అడ్డంకి కాదని.. మలి వయస్సులోనూ క్రీడలలో తమ సత్తా చాటుతూ మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నారని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ చైర్మన్, ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై.. లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ తాము ముందుంటామని అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ క్రీడలకు పటాన్చెరు వేదికగా నిలవడం గర్వంగా ఉందన్నారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను త్వరలో నిజామాబాద్ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గురువారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మట్టి పూల గోస పట్టింపు ఎప్పుడో?

- మురుసు తుఫాన్ జ్ఞాపకాలు తో కాలం గడిపేస్తున్న రైతన్న!
- మంత్రులు వచ్చారు! భరోసా ఇచ్చారు! పరిహారం ఎప్పుడు?
- రోజులు గడుస్తున్న అగ్రికల్చర్ అధికారులు జాడ లేని వైనం?
- కొండంత బలం ఇచ్చి ఆవిరి చేసిన అధికార పార్టీ!?
- ప్రళయం ఆగ్రహించిన ప్రభుత్వం అలిగిన నష్టపోయేది వ్యవసాయమే!



ప్రజా వాయిస్ అశ్వారావుపేట రాష్ట్రాన్ని ఈనెల నాలుగో తారీఖు తుఫాన్ పండికించిన సంగతి నేటికీ మట్టి పూలు మరిచిపోయే పరిస్థితి కనిపించిన పాపాన లేదు ఎందుకంటే ఆరు నెలలుగా పండించిన పంట నేలమట్టమై ధాన్యం మొలకెత్తి పరిస్థితి కనిపిస్తుంది. ప్రజా ప్రతినిధులు మాత్రం చుట్టూ చూపు లాగా వచ్చి కొండంత భరోసా ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రకటపల్లికి వెళ్ళిన నాటి నుండి నేటి వరకు ఒక్క ప్రభుత్వ అధికారి సైతం కనిపించిన దాఖలాలు లేవని అంతేకాకుండా మట్టిపూలను ఓదార్చే పరిస్థితి కూడా కనిపించలేదని తెలుస్తుంది ప్రళయాలు ఆగ్రహించిన ప్రభుత్వాలు అలిగిన నష్టపోయేది మాత్రం రైతులేనని తెలుస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని దమ్మపేట ములకలపల్లి చండ్రుగొండ అన్నపరెడ్డిపల్లి అశ్వారావుపేట వంటి మండలాల్లో పలు గ్రామాలలో మురుసు తుఫాన్ ప్రళయాన్ని సృష్టించింది. అటువంటి సందర్భంలో అనేక చెరువులు కాలువలు రహదారులు చెట్లు విద్యుత్ స్తంభాలు వంటి నిత్యవసర పరికరాలతో పాటు ఆరు కాలాలు పాటు పాండించిన పంటను సైతం నేలమట్టం చేయడంతో రైతన్న కుదేలైపోయాడని మట్టి పూలు బోరున వినిపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు మాత్రం హడావుడిగా పర్యటన చేసి కొండంత భరోసా ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని రైతన్నలకు అనేక రకాలుగా భరోసాలు ఇవ్వటంతో కొంత ఊరటను ఇచ్చినప్పటికీ తుఫాన్ దృశ్యాలు నేటికీ మరువలేని పరిస్థితి కనిపిస్తుందని కనీసం అధికారులు సైతం గ్రామాలలో పర్యటన చేసి అంచనా వేసిన దాఖలా లేనట్లు తెలుస్తుంది అంతేకాకుండా నేలమట్టమైన పంట మొలకెత్తే ప్రమాదాలు పొంచి ఉన్నాయని రైతన్న ఆందోళన చెందుతున్నారు.

గ్రామాలలో కనిపించని అగ్రికల్చర్ అధికారులు

మండలాల్లో ప్రజాప్రతినిధులు పర్యటన చేసి నేలమట్టమైన పంటలను అంచనా వేయాలని అలాగే కౌవుల రైతులను సైతం గుర్తించి వారిని కూడా ప్రభుత్వం ఆదుకునే విధంగా రైతులు సహకరించాలని బ్యాంకర్లు కూడా రుణాలు ఎలాంటి ఇబ్బందులను పెట్టకూడదని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అగ్రికల్చర్ అధికారులు మాత్రం సిబ్బంది కొరత అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప గ్రామాలలో పర్యటన చేసిన దాఖలాలు లేవని రైతు సంఘాలు సైతం తీవ్రంగా విమర్శిస్తున్నారు.

హామీలు నరే నష్టపరిహారం ఎప్పుడో!?

మురుస్ తుఫాన్ ప్రభావంతో ఒక్కసారిగా అయిపోయిన రైతన్నను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారాలు అందిస్తుందని ప్రకటనలకే తప్ప నష్టపరిహారాలు అందే పరిస్థితి కనిపించడం లేదని ప్రళయం నష్టపరిచి నెలలు గడుస్తున్న నేటికీ పంటలను అంచనాల వేయలేదని అంతేకాకుండా ఇంకా ఎప్పుడు నష్టపరిహారం వస్తుందో తెలియదని అధికార పార్టీ కేవలం మాటలకే తప్ప చేతలకు పనికిరాదని రహదారులు మరమ్మతుల కోసం అనేక రకాలుగా పనులు కొనసాగిస్తున్న అధికారి యంత్రం రైతులను ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియదని రైతుల నుండి ఆదాయం రాదని నిర్లక్ష్యం వహిస్తున్నారని సంఘాలు సైతం మండిపడుతున్న ఘటనలు మండలాల్లో దర్శనమిస్తున్నాయి ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి పంటల అంచనాలను వెంటనే నమోద కార్యక్రమాలు కొనసాగించాలని అలాగే నష్టపరిహారం సైతం తక్షణమే అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఐఎంఏ వైద్యుల తనిఖీల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి?

- ప్రజల ప్రయోజనమా..? ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల ప్రయోజనమా..?
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం లేకుండానే తనిఖీలు!
- ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యం లేకుండా చర్యలు ఎలా?
- కార్పొరేట్ ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేయని ఆర్ఎంపీలే టార్గెటా?
- హనుమకొండ, వరంగల్ కే పరిమితమైన తనిఖీలు
- ఉమ్మడి జిల్లాలోని మిగతా ప్రాంతాల సంగతేంటి?
- తనిఖీలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్

ప్రజా వాయిస్ – హనుమకొండ జిల్లా ప్రతినిధి బంతిలో కూర్చున్నప్పుడు వడ్డించేవాడు మనవాడైతే.. ఏ మూలన కూర్చున్నా మాంసం ముక్క పడదా? అన్న చందంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యులు నిర్వహిస్తున్న తనిఖీలపై పట్టణ ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ఎంపీ వైద్యుల ఆసుపత్రులపై జరుగుతున్న తనిఖీలు నిజంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమేనా? లేక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల ప్రయోజనాల కోసమా? అన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.గత ఏడాది కూడా హనుమకొండ, వరంగల్ పట్టణాల్లోని ఆర్ఎంపీ ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించి సుమారు 34 కేసులు పోలీస్ స్టేషన్లలో నమోదు చేసినట్లు సమాచారం. తాజాగా మరోసారి ఇదే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో మిగతా ప్రాంతాలు కనిపించడం లేదా?

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఆర్ఎంపీ ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోనూ ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తున్నారా? లేక హనుమకొండ, వరంగల్ పట్టణాలకే ఈ తనిఖీలు పరిమితమవుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో సమానంగా తనిఖీలు నిర్వహించకుండా కొన్ని ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రోగులను రిఫర్ చేయని ఆర్ఎంపీలే లక్ష్యమా?

తనిఖీలు నిర్వహిస్తున్న ఐఎంఏ వైద్యులకు చెందిన కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో వాటాలు ఉన్నాయనే ఆరోపణలు కూడా పట్టణంలో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు, అధికారిక నిర్ధారణ వెలుగులోకి రావాల్సి ఉంది. సదరు ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేయని ఆర్ఎంపీ వైద్యులనే లక్ష్యంగా చేసుకుని తనిఖీలు చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అన్నది సంబంధిత వర్గాలు స్పష్టం చేయాల్సి ఉంది.

ప్రభుత్వ అధికారులకు సమాచారం లేకుండానే తనిఖీలా?

ఆర్ఎంపీ ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించే సమయంలో సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యం లేకుండానే తనిఖీలు నిర్వహించి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణ పేరుతో జరిగే తనిఖీలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

డీఎంహెచ్ వో వివరణతో వెలుగులోకి వచ్చిన అంశం

ఈ వ్యవహారంపై హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్యను ప్రజా వాయిస్ ప్రతినిధి వివరణ కోరగా.. గత ఏడాది ఐఎంఏ వైద్యులు ఆర్ఎంపీ ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించి 34 కేసులు నమోదు చేసినట్లు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.ఈ ఏడాది నిర్వహిస్తున్న తనిఖీలపై తమకు సమాచారం ఇచ్చారా? అని ప్రశ్నించగా.. ఇప్పటివరకు తనకు ఎలాంటి సమాచారం అందలేదని, ఐఎంఏ వైద్యులు తనిఖీలు నిర్వహిస్తున్న విషయం ప్రజా వాయిస్ దినపత్రిక ద్వారానే తన దృష్టికి వచ్చిందని స్పష్టం చేశారు.సంబంధిత ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండా తనిఖీలు నిర్వహించవచ్చా? అని ప్రశ్నించగా.. ఆర్ఎంపీ ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించే ముందు తనకు సమాచారం అందించి, సంబంధిత ప్రభుత్వ అధికారులను కూడా భాగస్వామ్యం చేయాల్సి ఉంటుందని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ స్పందించాలి.. పారదర్శక విచారణ జరపాలి

ఐఎంఏ వైద్యులు నిర్వహిస్తున్న తనిఖీల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వకుండా తనిఖీలు నిర్వహించడానికి గల కారణాలేంటి? తనిఖీలు అన్ని జిల్లాల్లో సమానంగా ఎందుకు జరగడం లేదు? కార్పొరేట్ ఆసుపత్రుల ప్రయోజనాల కోసం ఆర్ఎంపీ వైద్యులను లక్ష్యంగా చేసుకుంటున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.ఆర్ఎంపీ వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా



వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. అదే సమయంలో తనిఖీలు నిర్వహించే వారూ నిబంధనలకు లోబడి, సంబంధిత ప్రభుత్వ అధికారుల సమక్షంలోనే వ్యవహరించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రజారోగ్యం పేరుతో జరిగే చర్యలు ఎలాంటి వ్యక్తిగత లేదా వ్యాపార ప్రయోజనాలకు వేదిక కాకూడదని పట్టణవాసులు కోరుతున్నారు.

భువనగిరిలో గుట్కా నిషేధం అమలవుతున్నట్టేనా?

- ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతర్.
- యథేచ్ఛగా గుట్కా వ్యాపారం!

ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: తెలంగాణ ప్రభుత్వం గుట్కా, పాన్ మసాలా విక్రయాలపై నిషేధం విధించినప్పటికీ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గుట్కా విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కొన్ని కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాల్లో గుట్కా ఉత్పత్తులు అందుబాటులో ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ గెజిట్ ఉత్తర్వులు ఎక్కడ?

తెలంగాణ గెజిట్‌లో 2026 మే 29న ప్రచురితమైన కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ నోటిఫికేషన్ నంబర్ 542/FSS-1/2026 ప్రకారం, పొగాకు లేదా నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలా ఉత్పత్తుల తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, విక్రయాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఒక సంవత్సరం పాటు నిషేధం విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిషేధం 25-05-2026 నుంచి అమల్లోకి వచ్చినట్లు గెజిట్‌లో ఉంది.అయితే భువనగిరి పట్టణంలో ఈ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల తనిఖీలు ఎక్కడ?

గుట్కా విక్రయాలపై సంబంధిత ఫుడ్ సేఫ్టీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు.గుట్కా, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల నోటి క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి వ్యాధులతో కుటుంబ సభ్యులను కోల్పోయిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా కలెక్టర్ స్పందించాలి!

భువనగిరి పట్టణంలో గుట్కా విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిషేధిత ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. ప్రభుత్వ నిషేధం కేవలం గెజిట్‌కే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



తెలంగాణ రాజ పత్రము
THE TELANGANA GAZETTE
PART-II EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY
No. 628] HYDERABAD, FRIDAY, MAY 29, 2026.
NOTIFICATIONS BY HEADS OF DEPARTMENTS, Etc.
COMMISSIONER OF FOOD SAFETY

రోడ్డుపై మృత్యు గొయ్యి.!

- పగిలిన గూనలు.. రహదారిపై భారీ గుంట
- 15 రోజులుగా పట్టించుకోని అధికారులు
- ప్రమాదం అంచున బీసీ హాస్టల్ విద్యార్థులు, వాహనదారులు
- రాత్రివేళల్లో పొంచి ఉన్న ముప్పు
- కోదాడ 21వ వార్డులో అధ్వానంగా మారిన రహదారి

ప్రజా వాయిస్,కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని 21వ వార్డులో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఎర్రకుంట చెరువుకు వెళ్లే కాలువ సమీపంలోని బీసీ హాస్టల్ రోడ్డుపై గూనలు పగిలి భారీ గుంట ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య ఏర్పడి 15 రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ రహదారి మీదుగా బీసీ హాస్టల్ విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గూనలు పగిలి ఏర్పడిన భారీ గుంటతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో గుంట కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పగిలిన గూనలను మరమ్మతు చేయడంతో పాటు గుంటను పూడ్చి రహదారిని బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



పంచాయతీలో పెత్తనం ఎవరిది

- అధికారుల విధులపై అజమాయిషీ ఎవరిది
- కార్యదర్శి కుర్చీలో సర్పంచ్ భర్త
- ప్రభుత్వ రికార్డుల పరిశీలనపై గ్రామస్తుల అభ్యంతరం

ప్రజా వాయిస్, మిర్యాలగూడ గ్రామ పంచాయతీ పాలనలో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న ఓ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామ పంచాయతీ కార్యదర్శికి కేటాయించిన గదిలోకి సర్పంచ్ భర్త వెళ్లి, కార్యదర్శి కుర్చీలో కూర్చొని కార్యాలయానికి సంబంధించిన రికార్డులు, పుస్తకాలను పరిశీలించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. నవంబర్ 15, 2026 ఆదివారం సెలవు దినం కావడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాధారణ విధులు కొనసాగని సమయంలో కార్యదర్శికి కేటాయించిన గదిని తెరిచి సర్పంచ్ భర్త లోపలికి వెళ్లినట్లు సమాచారం. అనంతరం కార్యదర్శి కుర్చీలో కూర్చొని కార్యాలయానికి సంబంధించిన పుస్తకాలు, రికార్డులను పరిశీలిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించినట్లు పేర్కొన్నారు.ఈ విషయాన్ని అక్కడున్న వారు ప్రశ్నించగా, అది కార్యదర్శి గది కాదని, ఆయన కుర్చీ కూడా కాదని సర్పంచ్ భర్త సమాధానం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో అక్కడే ఉన్న గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్‌ను ప్రశ్నించినప్పటికీ ఆయన మౌనంగా ఉండిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రశ్నించిన వారితో 'ఏమి చేసుకుంటారో చేసుకోండి' అన్న ధోరణిలో వ్యవహరించినట్లు కూడా ఆరోపిస్తున్నారు.



అధికారిక విధుల్లో జోక్యం చేసుకునే అధికారం ఉందా..

గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శికి నిర్దిష్టమైన విధులు, బాధ్యతలు ఉంటాయి. ప్రభుత్వ రికార్డుల నిర్వహణ, పత్రాల భద్రత, పరిపాలనా వ్యవహారాలు అధికారుల పరిధిలోనే కొనసాగాల్సి ఉంటుంది. అయితే ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు అధికారిక విధుల్లో జోక్యం చేసుకోవడం, ప్రభుత్వ రికార్డులను పరిశీలించడం వంటి అంశాలపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల బాధ్యతలు వేరు.. ప్రభుత్వ అధికారుల విధులు వేరనే విషయాన్ని సంబంధితులు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా..

ఈ ఘటనపై జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అసలు ఆ రోజు ఏం జరిగింది? కార్యదర్శి గదిని ఎవరి అనుమతితో తెరిచారు? ప్రభుత్వ రికార్డులను పరిశీలించడానికి అనుమతి ఉందా..అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రజలకు సేవలందించాల్సిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారిక విధులు, బాధ్యతల విషయంలో స్పష్టత ఉండాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారు.. విచారణకు ఆదేశిస్తారా..బాధ్యులపై చర్యలు తీసుకుంటారా.. అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



క్రీడలతో యువతలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి: కాటా శ్రీనివాస్ గౌడ్

పటన్ చెరువు ప్రజావాయిస్ పటాన్ చెరు మండలం భానూర్ గ్రామంలోని స్నేహ ఫంక్షన్ హాల్‌లో పవర్ డ్రాగన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో చైర్మన్ గోపాల్ యాదవ్ సారథ్యంలో రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ పోటీలను ప్రారంభించి, విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో ఆత్మరక్షణ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఇలాంటి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



తెలంగాణ కప్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో చీర్యాల విద్యార్థుల ప్రతిభ

- కాటా, కుమిటే విభాగాల్లో పతకాల పంట
- టీమ్ ఛాంపియన్ షిప్ కైవసం

ప్రజావాయిస్, నాగారం : నాగారం డివిజన్ పరిధిలోని ఆర్.ఎల్. నగర్‌లో డ్రాగన్ ఫిస్ట్ షాటోఖాన్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ కప్ 4వ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో చీర్యాల గ్రామానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. చీర్యాల గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ జంగయ్య వద్ద శిక్షణ పొందుతున్న KBFI విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుకున్నారు. కాటా విభాగంలో మణికేష్ బ్రౌన్ బెల్ట్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించగా, శ్రీహర్షిత్, అతని సోదరి మనోజ్ఞ సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. లక్ష్మీప్రణవ్ బ్రౌన్ బెల్ట్ సాధించగా, హేమచంద్ర, మేఘనాథ్ చెరో కాంస్య పతకం సాధించి సత్తా చాటారు. అదేవిధంగా స్పారింగ్ (కుమిటే) విభాగంలోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఒక స్వర్ణ పతకం, రెండు రజత పతకాలు సాధించారు. అంతేకాకుండా టీమ్ ఛాంపియన్‌షిప్‌ను సైతం కైవసం చేసుకోవడం విశేషం. చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు చూపిన ప్రతిభ, సాధించిన విజయాల పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శిక్షణ అందించిన కరాటే మాస్టర్ జంగయ్యను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి, ముప్పు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కౌకుట్ల అనంత్ రెడ్డి, గ్రాండ్ మాస్టర్ సత్యశంకర్ తదితరులు పాల్గొన్నారు...

కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా పోలీసుల వేధింపులా?

- మా సొంత భూమిలో వ్యవసాయం చేసుకోనివ్వరా?
- తుర్కపల్లి పోలీసుల తీరుపై బాధితుడు రాజినీకాంత్ ఫిర్యాదు.
- ఎస్సై శివకృష్ణ, ఇద్దరు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు.
- డోజర్లు, వ్యవసాయ వాహనాలను అడ్డుకుని పనులు నిలిపివేశారని ఆరోపణ.
- కటారి మంజుల, ఆమె భర్త వేధింపులకు పాల్పడుతున్నారని బాధితుడి ఆవేదన.
- పోలీసుల వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని విజ్ఞప్తి.



ప్రజా వాయిస్ / యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: తమ సొంత వ్యవసాయ భూమిలో ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే హక్కు కూడా లేకుండా పోయిందని, సివిల్ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసినప్పటికీ పోలీసులు తమ వ్యవసాయ పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఓ బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో తనకు సుమారు 2.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని బొమ్మలరామారం మండలం పిల్లిగుండ్ల తండాకు చెందిన ఎం. రాజినీకాంత్ తెలిపారు. ఈ భూమి విషయంలో కటారి మంజుల, ఆమె భర్త కటారి సూర్యప్రకాశ్ రావు, వారి వాచ్‌మెన్లు కొంతకాలంగా తమను వేధిస్తూ, బెదిరిస్తూ వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.ఈ సమస్యపై తాము సివిల్ కోర్టును ఆశ్రయించగా, పట్టాదారు పాస్‌బుక్‌తో పాటు భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించిన అనంతరం తమకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ జారీ అయిందని బాధితుడు పేర్కొన్నారు.అయినప్పటికీ వేధింపులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

14/11/2026న వ్యవసాయ పనుల వద్ద పోలీసుల జోక్యం?

ఈ నెల 14వ తేదీన తమ భూమిలో వరి వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో తుర్కపల్లి పోలీస్ స్టేషన్ SI శివకృష్ణ, కానిస్టేబుళ్లు మోహన్, నర్సింహ అక్కడికి వచ్చి వ్యవసాయ పనులు నిలిపివేయాలని హెచ్చరించారని రాజినీకాంత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు భూమి కటారి మంజులదని చెబుతూ డోజర్లు, ఇతర వ్యవసాయ వాహనాలను నిలిపివేయించారని, డ్రైవర్లతో దురుసుగా మాట్లాడారని ఆరోపించారు.తమకు అనుకూలంగా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకోకుండా పోలీసులు వ్యవసాయ పనులను అడ్డుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కటారి మంజుల కుటుంబానికి స్థానిక పోలీసులతో పరిచయాలు, పలుకుబడి ఉండటం వల్లే తమకు అన్యాయం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులపై డబ్బులు తీసుకుని ఒక పక్షానికి సహకరిస్తున్నారనే అనుమానం కూడా ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

ఉన్నతాధికారులు స్పందించాలి.. బాధితుడికి న్యాయం చేయాలి!

తన ఫిర్యాదులో SI శివకృష్ణ, కానిస్టేబుళ్లు మోహన్, నర్సింహల వ్యవహారంపై ఉన్నతాధికారులతో నిష్పక్షపాత విచారణ జరిపించాలని, కోర్టు ఆదేశాలను గౌరవించేలా చర్యలు తీసుకోవాలని రాజినీకాంత్ కోరారు. తమ వ్యవసాయ పనులకు ఆటంకాలు కలగకుండా పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే కటారి మంజుల, ఆమె భర్త, వారి వాచ్‌మెన్ల వేధింపులపై విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్, కోర్టు ఇంజక్షన్ ఆర్డర్, ఫోటోలు, వీడియోలు తదితర ఆధారాలను అధికారులకు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.కోర్టు ఆదేశాలు ఉన్నాయంటున్న బాధితుడి ఫిర్యాదుపై పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారు? ఇరు పక్షాల పత్రాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేస్తారా? అనేది వేచి చూడాలి.





పగలు 'పనులు'.. ప్రయాణికులకు 'తిప్పలు'!

- బాసర - బైంసా వంతెనపై ఆర్ అండ్ బి అధికారుల తీరుపై విమర్శలు
- రాత్రిపూట పనులు చేయాలంటూ విజ్ఞప్తి

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని బైంసా నుండి బాసర వెళ్లే రహదారిలో వంతెన పై నిర్మిస్తున్న పనుల వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి సాధారణంగా రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, అంతర్రాష్ట్ర వంతెనలపై మరమ్మతు పనులు చేపట్టేటప్పుడు అధికారులు పక్కా ప్రణాళికతో వ్యవహరించాలి.కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా జరుగుతోంది.ఉదయం నుండి సాయంత్రం 6, 7 గంటల వరకు ఈ రహదారిపై విపరీతమైన రద్దీ ఉంటుంది.ఉద్యోగస్తులు, విద్యార్థులు,విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారులు, బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు,భారీ అంతర్రాష్ట్ర వాహనాలతో ఈ మార్గం కిటకిటలాడుతుంది. సరిగ్గా ఇదే రద్దీ సమయంలో పనులు చేపడుతుండటంతో వంతెనకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. రద్దీ తగ్గే రాత్రి వేళల్లో ఈ పనులు చేపడితే ప్రయాణికులకు ఏమాత్రం ఇబ్బంది ఉండదు కదా? అన్న కనీస ఆలోచన ఆర్ అండ్ బి అధికారులకు ఎందుకు రాలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఎమ్మెల్యే ప్రయాణించే దారిలోనే ఇంత నిర్లక్ష్యమా?అనునిత్యం స్థానిక ఎమ్మెల్యే సైతం ఇదే రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. సామాన్య ప్రయాణికులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం ఈ ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.వంతెనపై సగం రోడ్డును తవ్వేసి,ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు వంతెనపై కనీసం కదలడానికి కూడా వీలు లేకుండా పోతోంది.ఒక వైపు రోడ్డు మరమ్మతులు జరుగుతున్నప్పుడు, అక్కడ ట్రాఫిక్ స్తంభించకుండా చూడాల్సిన బాధ్యత ట్రాఫిక్ యంత్రాంగంపై ఉంది.కానీ వంతెన వద్ద కనీసం ఒక్క ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా కనిపించకపోవడం గమనార్హం. ఫలితంగా ఎవరికి వారే ముందుకెళ్లాలనే తొందరలో వాహనాలను అడ్డదిడ్డంగా పోనిస్తుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.రాత్రి వేళల్లో కేవలం ఒకే ఒక ఫ్లడ్ లైట్ వెలుతురులో,సరైన రేడియం సూచికలు లేకపోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు.అధికార యంత్రాంగం మధ్య సమన్వయ లోపానికి సామాన్య ప్రజలు బలవుతున్నారు. ఆర్ అండ్ బి, పోలీస్ శాఖలు తక్షణమే స్పందించి పగటిపూట రద్దీ వేళల్లో పనులను నిలిపివేసి, కేవలం రాత్రి వేళల్లోనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అలాగే పనులు పూర్తయ్యే వరకు వంతెనకు ఇరువైపులా ట్రాఫిక్ ను నియమించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దుర్వాసన మధ్య విద్యాభ్యాసం!!

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?
- వందలాది మంది విద్యార్థినులకు సరిపోని మరుగుదొడ్లు
- కనీస పారిశుద్ధ్య సౌకర్యాలూ కరువు!
- వికారాబాద్ కేజీబీవీలో విద్యార్థినుల ఇబ్బందులు
- పట్టించుకునే వారేరీ?



ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాల్సిన ప్రభుత్వ బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రశ్నార్థకంగా మారుతోంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు సరిగా లేవని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వందలాది మంది విద్యార్థినులకు అందుబాటులో ఉన్న మరుగుదొడ్లు సరిపోకపోవడం, వాటి నిర్వహణలో లోపాలు, పరిసరాల్లో దుర్వాసన వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

మరుగుదొడ్లు తక్కువ.. ఇబ్బందులు ఎక్కువ!

విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అపరిశుభ్రత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. బాలికల విద్యాసంస్థల్లో పరిశుభ్రమైన వాతావరణం, తగినన్ని మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు తప్పనిసరిగా ఉండాల్సి ఉన్నప్పటికీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి.

తల్లిదండ్రులకు అందని సమాచారం?

తమ పిల్లల క్షేమసమాచారం తెలుసుకునేందుకు, సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు వచ్చే తల్లిదండ్రులకు సందర్శన అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పాఠశాల యాజమాన్యం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఏది?

జిల్లా కేంద్రంలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థినుల కనీస సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని విద్యాసంస్థలోనే ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల హక్కుల కోసం పనిచేసే ప్రజా, విద్యార్థి సంఘాలు కూడా ఈ సమస్యపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్

జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు కేజీబీవీని సందర్శించి విద్యార్థినుల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు. మరుగుదొడ్ల సంఖ్య, వాటి నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులు, తాగునీటి వసతులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బాధ్యుల నిర్లక్ష్యం నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థులకు పుస్తకాలు, పాఠాలు అందించడం మాత్రమే విద్యాభివృద్ధి కాదు.. వారు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునేలా కనీస సౌకర్యాలు కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీబీవీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతారా? లేక విద్యార్థినుల ఆవేదన అరణ్యరోదనగానే మిగిలిపోతుందా? అనేది వేచి చూడాలి.

గగన్‌పహాడ్ రోడ్లపై మృత్యు లారీలు

- అధికారులది మొద్దునిద్ర
- లారీలకు అడ్డూ అదుపూ లేదు
- ప్రజల ప్రాణాలకు దిక్కులేదు.?
- భారీ సిమెంట్ లారీల రాంగ్ రూట్ ప్రయాణంతో ప్రమాదాల ముప్పు
- లారీ ఢీకొని సెక్యూరిటీ గార్డు సాజన్ విరిగిన కాలు ఉస్మానియా ఆసుపత్రికి తరలింపు
- ఐదు నెలల క్రితమే ఫిర్యాదు
- అయినా అధికారుల నుంచి చర్యలు శూన్యం
- అధికారుల తీరుపై బిఆర్ఎస్ నేత శీలం తిరుపతి రెడ్డి తీవ్ర ఆగ్రహం



ప్రజావాయిస్||రాజేంద్రనగర్: భారీ సిమెంట్ లారీల ఇష్టారాజ్యపు రాకపోకలు గగన్‌పహాడ్ ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నాయి.ప్రైస్టీజ్ ప్రాజెక్ట్‌కు నిత్యం భారీ లారీలు రాకపోకలు సాగిస్తూ,రాంగ్ రూట్‌లో ప్రయాణించడంతో స్థానికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలపై నియంత్రణ లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బీఆర్ఎస్ సీనియర్ నేత శీలం తిరుపతి రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

తాజా ప్రమాదంతో వెలుగులోకి వచ్చిన నిర్లక్ష్యం

తాజాగా కల్పతరువు ప్రాజెక్టుకు సంబంధించిన భారీ సిమెంట్ లారీ రాంగ్ రూట్‌లో వచ్చి సైకిల్‌పై వెళ్తున్న సుమారు 50 ఏళ్ల సాజన్ అనే సెక్యూరిటీ గార్డును"ఢీ"కొట్టింది.ఈ ప్రమాదంలో ఆయన కాలు విరిగి తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. భారీ వాహనాల నిర్లక్ష్యపు రాకపోకల కారణంగా సామాన్యులు ప్రమాదాల బారిన పడుతున్నారని తిరుపతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించే వరకు అధికారులు ఎదురుచూస్తున్నారా.? అని ప్రశ్నించారు.

ఐదు నెలల క్రితమే ఫిర్యాదు... చర్యలు మాత్రం ఎక్కడ?

భారీ సిమెంట్ లారీల రాకపోకల సమస్యపై మే 25,2026న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకట నర్సయ్యకు, ఇతర సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తిరుపతి రెడ్డి తెలిపారు.ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులపైనా స్పందించని అధికార యంత్రాంగం ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తోందని నిలదీశారు.

ప్రాజెక్టుల పనులే ముఖ్యమా... ప్రజల ప్రాణాలు పట్టవా?

భారీ వాహనాలు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నా, ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ఎందుకు నియంత్రించడం లేదని తిరుపతి రెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్టుల యాజమాన్యాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యమా.? లేక ప్రాజెక్ట్ యాజమాన్యాలకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నారా.? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు.

ఇకనైనా స్పందించకుంటే గ్రామస్థులతో కలిసి ధర్నా

సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి భారీ సిమెంట్ లారీల రాంగ్ రూట్ ప్రయాణాలను అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు పటిష్టమైన రవాణా నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇకనైనా అధికారులు స్పందించకపోతే గగన్‌పహాడ్ గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.





సోమవారంనెన్నెలకు బస్సు నడపాలని సర్పంచ్ ధర్నా

50–60 ఏళ్లుగా కొనసాగుతున్న రవాణా సౌకర్యాన్ని నిలిపివేయడంపై గ్రామస్థుల ఆగ్రహం
ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి చొరవతో సమస్య పరిష్కారం.. ధర్నా విరమణ

ప్రజా వాయిస్, నెన్నెల్/బెల్లంపల్లి:

గ్రామ ప్రజలకు దశాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా నెన్నెల గ్రామ సర్పంచ్ ఎండీ ఇబ్రహీం గురువారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. బెల్లంపల్లి నుంచి నెన్నెల మీదుగా మైలారం వెళ్లే ఆర్టీసీ బస్సు గత 50--60 ఏళ్లుగా నెన్నెల గ్రామంలోకి వచ్చి ప్రయాణికులకు సేవలందిస్తోందని గ్రామస్థులు తెలిపారు. ఈ బస్సు ద్వారా విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఇటీవల బస్సును గ్రామంలోకి తీసుకురాకుండా ప్రధాన రహదారి మీదుగానే నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు గ్రామంలోకి రాకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు సహా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ ఇబ్రహీం పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న రవాణా సౌకర్యాన్ని అకస్మాత్తుగా నిలిపివేయడం సమంజసం కాదని, ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆర్టీసీ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఐ చొరవతో సమస్యకు పరిష్కారం

సర్పంచ్ ధర్నా విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్థులతో పాటు ఆర్టీసీ డ్రైవర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. బస్సును యథావిధిగా గ్రామంలోకి నడిపిస్తామని హామీ ఇవ్వడంతో సర్పంచ్



ఇబ్రహీం, గ్రామస్థులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కీసరి సంతోష్, మాజీ ఉపసర్పంచ్ గడ్డం స్వామి గౌడ్, భాస్కర్, అంజన్న, కృష్ణస్వామి, తిరుమల్, రాము, శ్రీశైలం, ఆశన్న, తాజ్, బావు, వెంకన్న, దుర్గయ్య, ప్రవీణ్, నాగేష్, సంతోష్, లస్మయ్య, మల్లన్నతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



పంచరాయి భూముల సమస్యను పరిష్కరించాలి..

భూభారతిలో పట్టాలు నమోదు చేయాలి..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 439 గల పంచరాయి భూముల సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని భూ బాధితులు డిమాండ్ చేశారు. ఆదివారం దండేపల్లి గ్రామంలో నేతకాని వాస్తవ్యులకు చెందిన భూ బాధితులు సమావేశమై గతంలో అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈనెల 4న హనుమకొండ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్కతుర్తి తహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి సమావేశంలో పట్టా పాస్ బుక్ లు ఉండి భూమి చూపని వారికి భూమి చూపిస్తామని ప్రస్తుతం భూములు సాగు చేసుకుంటున్నా వారికి భూమి ఉన్నవారికి అలాగే భూమిలేని అర్హులకు దరఖాస్తు చేసుకుంటే పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీల మేరకు బాధితుల వివరాలను భూభారతి రికార్డుల్లో నమోదు చేసి అర్హులందరికీ పట్టాలు అందించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కామెరా లక్ష్మణ్, రేణుకుంట్ల సాంబయ్య, అక్కివెల్లి సమ్మయ్య, కామెర గాలిబు, అక్క వెల్లి విజయ, బండారి శోభ, కామెరా రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది

మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తుంది
గత ప్రభుత్వం పదేళ్లలో కొత్త పెన్షన్లు ఇవ్వలేదు
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 4.50 లక్షల కొత్త పెన్షన్లు
వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య.. మంత్రి సీతక్క, శాసనసభ్యులు నాగరాజు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులు ఉన్నప్పటికీ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.మల్లారెడ్డి పల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనంతో పాటు ఐ భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజు కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. అంతకుముందు హనుమకొండకు చేరుకున్న మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య పుష్పగుచ్ఛం అందజేసిన స్వాగతం పలికారు. అనంతరం నూతన చేయూత ఫించన్లు మంజూరు మరియు ఉత్తర్వులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతో పాటు సంక్షేమ



పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. గతంలో రాష్ట్రంలో సుమారు 40 లక్షల పింఛన్లు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, నేత కార్మికులు, గీత కార్మికులు, దివ్యాంగులకు పింఛన్లు అందిస్తూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని చెప్పారు.గత పదేళ్లలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతల్లో సుమారు 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇందుకోసం రూ.40 వేల కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గతంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను సైతం మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు.పాత, కొత్త పింఛన్ల కోసం కలిపి ఏడాదికి సుమారు రూ.12 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, పేదల సంక్షేమం కోసం భారీగా నిధులు వెచ్చిస్తోందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో పాటు మహిళలను వ్యాపారవేత్తలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణలో మహిళలకు అవకాశాలు కల్పించడం మహిళా సాధికారత దిశగా చేపడుతున్న చర్యలకు నిదర్శనమని చెప్పారు.మహిళల సమస్యలను మహిళలే మరింత సమర్థవంతంగా అర్థం చేసుకోగలరని, మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాల అమలులో మంత్రి సీతక్క కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ లౌకికవాదం, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులుగా తాము ప్రజలకు సేవ చేసే అవకాశం పొందామని అన్నారు. అయితే ఓటు హక్కు, రాజ్యాంగ హక్కుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల తొలగింపు, ఓటు చోరీ అంశాలపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని, దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ గుండు సుధారాణి, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురంలో ఘనంగా ఎన్నారై రవి జన్మదిన వేడుకలు

ప్రజా వాయిస్,అనంతగిరి

అనంతగిరి మండలంలోని ఖానాపురం గ్రామంలో ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెల్లంకొండ రవి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యుడు ఉయ్యాల వీరయ్య గౌడ్, గ్రామ గౌడ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉయ్యాల వీరయ్య గౌడ్ మాట్లాడుతూ బెల్లంకొండ రవి జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. దేవాలయాలు, విద్యాసంస్థల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవలో తనవంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం సభ్యులు, రవి అభిమానులు పాల్గొన్నారు.

జీవితాంతం ఒకే జెండా మోసేది కమ్యూనిస్టు కార్యకర్తలే...

- సీపీఐ సీనియర్ నాయకుడు అసాల మధునయ్య సేవలు చిరస్మరణీయం
- సంస్మరణ సభలో నివాళులర్పించిన సూర్య, సీపీఐ నాయకులు

ప్రజా వాయిస్ గోదావరిఖని

జీవితాంతం ఒకే సిద్ధాంతానికి, ఒకే జెండాకు కట్టుబడి పనిచేయడం కమ్యూనిస్టు కార్యకర్తలకే సాధ్యమని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ లెనిన్ నగర్ శాఖ కార్యదర్శి కామ్రేడ్ అసాల మధునయ్య మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్ నగర్ శాఖ కార్యదర్శి సిరిసిల్ల మల్లేష్ అధ్యక్షతన ఆదివారం అసాల మధునయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,



రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య తదితరులు మధునయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. లెనిన్ నగర్ బస్తీ నిర్మాణం మొదటి నుంచి మధునయ్య కీలకంగా పనిచేశారని, ఆ ప్రాంతానికి లెనిన్ నగర్ అనే పేరు పెట్టడంలోనూ ఆయన పాత్ర ఉందని గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొందరు నాయకులు పార్టీలు, జెండాలు మారుస్తున్నప్పటికీ, మధునయ్య మాత్రం నీతి, నిజాయితీలకు కట్టుబడి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీ జెండానే మోశారని పేర్కొన్నారు. జీవితకాలం ఒకే జెండాను మోస్తూ, ఒకే సిద్ధాంతం కోసం పనిచేసిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. మధునయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కే. స్వామి, మాటేటి శంకర్, రాజారత్నం, అసాల రమ, రేణిగుంట్ల ప్రీతం, అసాల నవీన్, శనిగరపు చంద్రశేఖర్, అబ్దుల్ కరీం, తోడుపునూరి రమేష్ కుమార్, అసాల కొమురయ్య, కొండ్రా రాజయ్యతో పాటు మధునయ్య కుటుంబ సభ్యులు అసాల లెనిన్, అసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన కీసరగుట్ట క్షేత్రం..
స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు,
కార్తీక ద్వీపాలు వెలిగించిన భక్తులు





ప్రజావాయిస్, కీసర :

కార్తీకమాసం ఆదివారం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి చేరుకోవడంతో క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటకం వెంకటేష్ శర్మ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీకమాసం విశిష్టతను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందిఆలయం లోపల, వెలుపల ఉన్న శివలింగాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాల వెలుగులతో కీసరగుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.కార్తీకమాసంలో స్వామివారిని దర్శించుకోవడం, దీపారాధన చేయడం ఎంతో పుణ్యప్రదమని భావిస్తూ భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు.

అస్తమించే సూర్యుడికీ ఆరాధన....ఉదయించే సూర్యుడికీ నీరాజనం

రాజేంద్రనగర్ పత్తికుంట వద్ద భక్తిపారవశ్యంలో ఛత్ పూజ వేడుకలు
36 గంటల కఠిన ఉపవాస దీక్షతో సూర్యారాధన
కుటుంబ క్షేమం,పిల్లల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

ప్రజావాయిస్,రాజేంద్రనగర్

:ప్రకృతికి ప్రణామం.సూర్య భగవానుడికి నీరాజనం. కుటుంబ సంక్షేమం కోసం కఠిన ఉపవాస దీక్షలు,ఇలా భక్తి,నియమనిష్ఠలు, సంప్రదాయాల కలయికగా ఛత్ పూజ వేడుకలు రాజేంద్రనగర్‌లోని పత్తికుంట వద్ద ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.ఉత్తర భారతీయుల ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ పండుగలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.విష్ణు శ్యామ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించి అనంతర మాట్లాడుతూ.. ఛత్ పూజ అనేది కేవలం పండుగ మాత్రమే కాదని, ప్రకృతి పట్ల మనిషికి ఉండాల్సిన



కృతజ్ఞతాభావాన్ని చాటిచెప్పే గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయమన్నారు.సకల జీవరాశికి వెలుగును, జీవశక్తిని ప్రసాదించే సూర్యభగవానుడిని ఆరాధించడం ద్వారా ప్రకృతి ప్రాముఖ్యతను ఈ పండుగ చాటి చెబుతుందని వివరించారు.ముఖ్యంగా ఉదయించే సూర్యుడికి,అస్తమించే సూర్యుడికి,అర్ఘ్యం సమర్పించడం ఛత్ పూజలో అత్యంత విశిష్టమైన సంప్రదాయమని పేర్కొన్నారు.సాధారణంగా ఉదయించే సూర్యుడిని ఆరాధించడం మనకు తెలిసిందేనని,కానీ ఛత్ పూజలో అస్తమించే సూర్యుడిని సైతం భక్తితో పూజించడం జీవితంలోని ప్రతి దశకు ఇచ్చే గౌరవానికి నిదర్శనమని తెలిపారు. సూర్యుడు,నీరు,ప్రకృతి లేకుండా జీవనం సాధ్యం కాదనే సందేశాన్ని ఈ పండుగ సమాజానికి అందిస్తుందన్నారు.ఈ పూజలో మహిళలతో పాటు పురుషులు కూడా నిర్జల ఉపవాస దీక్షలు చేపడతారని,కొందరు భక్తులు సుమారు 36 గంటల పాటు ఉపవాసం పాటిస్తూ అత్యంత నిష్ఠతో దీక్షను కొనసాగిస్తారని వివరించారు.కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు,పిల్లల క్షేమం, కుటుంబ అభివృద్ధి, సుఖసంతోషాలు కలగాలని ఛతీ మాతను, సూర్యభగవానుడిని ప్రార్థించడం ఈ పండుగ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పండ్లు,చెరకు, కొబ్బరి తదితర సంప్రదాయ ప్రసాదాలతో సూర్యుడికి అర్ఘ్యం సమర్పిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.భాషలు, ప్రాంతాలు వేరైనా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలందరినీ ఒకే ఆధ్యాత్మిక వేదికపైకి తీసుకువస్తాయని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది.ఈ కార్యక్రమంలో రాపోలు సత్తయ్య,నరసింహ, ముడుమాల శ్రీకాంత్, గోల్కొండ రాజ్ కుమార్, సిరాజ్,శివకుమార్,కవి రాజు,కోరని కృష్ణ,వికాస్ తదితరులు పాల్గొన్నారు.



జీవితంలో సరైన దారి చూపించేవి పుస్తకాలే

పసునూరి రాజేంద్రప్రసాద్..
జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి

ప్రజా వాయిస్, మహబూబాబాద్..
మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ,59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఈరోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్ర ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి లిపుస్తకలి లిప్రదర్శనలి ప్రారంభించారు.ఈ సందర్భంగా డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్పర్ధయ వర్ధతే విద్య, అని చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకాన్ని మాత్రం కొనుక్కోవాలనే మహానుభావుల మాటలను గుర్తు చేస్తూన్నారు, జీవితంలో సరైన దారి చూపించే పుస్తకాలు మాత్రమే అని అన్నారు. ప్రసార మాధ్యమాలు వేగవంతంగా సమాచారాన్ని క్షణకాలంలో అందిస్తున్నప్పటికీ, మానవుని మేధో వికాసానికి పుస్తకమే పునాది అని అంటూ, చిన్నతనం నుంచి పిల్లలలో పుస్తక పఠనం అలవాటు పెంపొందిస్తే వారు కేవలం పరీక్షలో మార్కులు సాధించే విద్యార్థులుగా కాకుండా ప్రశ్నించే, ఆలోచించే, సృజనాత్మకంగా స్పందించే పౌరులుగా ఎదుగుతారు అని అంటూ పుస్తక పఠన సంస్కృతి పెరిగితేనే విజ్ఞాన సమాజ నిర్మితమవుతుంది, విజ్ఞాన సమాజమే దేశాభివృద్ధికి నిజమైన పునాది కాబట్టి ప్రపంచాన్ని మార్చే శక్తి పుస్తకానికి మాత్రమే ఉంది, మంచి వ్యక్తిత్వం ,మంచి సమాజం పుస్తకాల ద్వారానే ఏర్పడుతుందని అన్నారు. కావున పుస్తక పఠనానికి గ్రంథాలయాలే పునాదులు అని అన్నారు,ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు జి. విజేందర్,రుద్రారపు వీరేందర్, సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి, బి. యాదమ్మ గ్రంథాలయ పాఠకులు హరిలాల్, ఆర్ సి. విజ్ఞాన్, అనూప్ సూరజ్, మౌనిక ,కవిత, సరిత పుస్తక ప్రియులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...



ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అజీంపేట సర్పంచ్ లింగస్వామి యాదవ్

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:
ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సర్పంచ్ కన్నెబోయిన లింగస్వామి యాదవ్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని అజీంపేటలో మహిళా సంఘ బంధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన (ఐకెపి) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. రైతుల సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోగుల మహేష్ గౌడ్, మహిళ సంగం అధ్యక్షురాలు బొమ్మగాని పద్మ, విఓఏ కన్నెబోయిన మమత, సీసీలు యాదయ్య, ప్రసాద్, మహిళా సంఘం సభ్యులు పార్వతమ్మ, లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు వెంకన్న, మహేష్, వెంకటేష్, మల్లేష్, వెంకన్న, లింగస్వామి రేషన్ డీలర్ సుధాకర్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళను ప్రారంభించిన మంత్రి దామోదర్

ప్రజా వాయిస్ సంగారెడ్డి :



రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు జేఎన్టీయూ సుల్తాన్పూర్ లోని ఆడిటోరియంలో నిర్వహించిన జాబ్ మేళను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ జాబ్ మేళాకు వచ్చిన నిరుద్యోగ యువకులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యతోపాటు స్కిల్ డెవలప్మెంట్ ను కలిగి ఉండాలని మంత్రి నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. కార్పోరేట్ సంస్థలకు అవసరమైన మానవ వనరులు తెలంగాణ రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయన్నారు. ఫోక్సకాన్ ఎలక్ట్రానిక్ దిగ్గజ సంస్థలో ఉద్యోగాల కల్పన కోసం శ్రీ ఏజెన్సీ సహకారంతో ఏర్పాటుచేసిన జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ జాబ్ మేళాలో సుమారు 1000 మంది నిరుద్యోగ యువతి, యువకులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు.

నల్లగొండలో కిసాన్ సభ మహాసభలకు వనపర్తి నుంచి తరలివెళ్లిన కార్మికులు

సీఐటీయూ జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు
రైతు, కార్మిక ఐక్యతను చాటనున్న అఖిల భారత మహాసభలు

ప్రజా వాయిస్ - వనపర్తి:
నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలకు వనపర్తి జిల్లా నుంచి కార్మికులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రయాణించే వాహనాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు సీఐటీయూ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. వీర తెలంగాణ పోరాటాల పురిటిగడ్డ నల్లగొండలో అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. నవంబర్ 15న లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఈ సభకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు బృందా కారత్, రైతు సంఘం అఖిల భారత అధ్యక్షుడు అశోక్ ధావళే, ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు వెల్లడించారు.నాలుగు రోజులపాటు జరిగే ప్రతినిధుల సభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించి, రైతుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. నూతన అఖిల భారత కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. 90 ఏళ్ల రైతు ఉద్యమ ప్రస్థానం దేశానికి ఎన్నో అనుభవాలను అందించిందని, ఈ మహాసభలు చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలవనున్నాయని అన్నారు.మహాసభల సందర్భంగా అగ్రి షో ప్రారంభమైందని, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని రైతు, కార్మిక ఐక్యతను చాటనున్నారని పుట్ట ఆంజనేయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికుల సమీకరణకు నాయకత్వం వహించిన డి. కురుమయ్య, జి. బాలస్వామితో పాటు సీఐటీయూ నాయకులు ఏ. కృష్ణయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ. లక్ష్మి, వనపర్తి కౌన్సిలర్ మదన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముత్యాలు, సీఐటీయూ నాయకులు ఎం. మన్యం, బి. కురుమయ్య, డి. శ్రీను, డి. ఆంజనేయులు, గంధం రత్నయ్య, జి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి మిల్లు నిర్వాహకుల చేతివాటం...

- చెప్పింది ఒక ధర ఇచ్చేది మరో ధర..
- యజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు
- కాటన్ మిల్ వద్ద రైతుల ఆందోళన

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
పత్తి మిల్లు నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని కేతకి సంగమేశ్వర కాటన్ మిల్లులో చోటుచేసుకుంది. రైతుల కష్టాన్ని కొందరు మిల్లు నిర్వాహకులు తమకు లాభంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్వింటాల్ పత్తికి ముందుగా ఒక ధర చెప్పి.. కొనుగోలు తర్వాత రకరకాల ఛార్జీల పేరుతో కోతలు విధిస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం నాగ్వార్ శివారులోని కేతకి సంగమేశ్వర్ కాటన్ మిల్ వద్ద పత్తి రైతులకు చేదు అనుభవం ఎదురవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. క్వింటాల్





పత్తికి ముందుగా రూ.9,050 ధర ఇస్తామని చెప్పి.. రైతులు పత్తిని మిల్లుకు తీసుకొచ్చి విక్రయించిన తర్వాత లేబర్ ఛార్జీల పేరుతో రూ.131 కోత విధించి, కేవలం రూ.8,919 మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. మిల్లుకు పత్తి తీసుకురాకముందు ఒక ధర చెప్పడం.. తీసుకొచ్చిన తర్వాత లేబర్ ఛార్జీలు, ఇతర ఖర్చుల పేరుతో డబ్బులు కట్ చేయడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక పత్తి కొనుగోలు చేసిన తర్వాత కనీసం బిల్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. పత్తి వ్యాపారం చేసే దళారులకు ఒక క్వింటాలు కు 9200 రూపాయలు చెల్లిస్తున్నారని, నేరుగా రైతులు వెళ్తే కోతలు విధిస్తూ మరో ధర చెల్లిస్తున్నారాని మిల్లు నిర్వాహకులతో రైతులు వాగ్వాదానికి దిగారు. తమకు జరుగుతున్న అన్యాయంపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చేతివాటం, ప్రజాప్రతినిధుల అండదండలతోనే మిల్లు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిల్లు వ్యవహారంపై విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. అన్నదాత పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాల్సింది పోయి.. ఇలా ధరల పేరుతో కోతలు విధిస్తే రైతు పరిస్థితి ఏంటిఅని..రైతుల ఆరోపణలపై అధికారులు స్పందించి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

సర్వస్వం త్యాగం చేసినా..

-మల్లన్నసాగర్ నిర్వాసితులకు దక్కని న్యాయం
- సిద్దిపేట సభలో సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- పెండింగ్ పరిహారాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు మంజూరు చేయాలి
- అర్హులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలి
- పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి
- పాఠశాలలు, ఆలయాలు, శ్మశానవాటికలు నిర్మించాలి
- యువతకు ఉపాధి.. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి
- ఒంటరి మహిళలు, పురుషులను ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించాలి
- సమస్యలు పరిష్కరించకుంటే మరో దశ ఉద్యమం తప్పదు : బండ్ల స్వామి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, పూర్వీకుల ఆస్తులతోపాటు సొంత గ్రామాలను సైతం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభలో తమ సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖను గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వాసితుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుడు బండ్ల స్వామి మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా నిర్వాసితుల కష్టాలు తీరలేదని, ఏళ్ల తరబడి పరిహారాలు, పునరావాస ప్రయోజనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వే లోపాలతో పరిహారాలకు దూరమైన అర్హులైన నిర్వాసితులు
ప్రాజెక్టు భూసేకరణ సమయంలో నిర్వహించిన సర్వేల్లో లోపాలు, అసంపూర్ణ వివరాల కారణంగా పలువురు అర్హులైన నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని ఆరోపించారు. ఇళ్ల పరిహారం, ఇంటి స్థలాలకు సంబంధించిన పరిహారం, ఇతర బకాయిల విషయంలోనూ అర్హులైన కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం కారణంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిహారాలన్నింటినీ పరిశీలించి అర్హులైన ప్రతి కుటుంబానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలతోపాటు ఇళ్ల కేటాయింపులు పూర్తి చేయాలని, అర్హులకు ఇంటి స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందించాలని కోరారు.

ఒంటరి మహిళలు, పురుషులను ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించి ప్యాకేజీలు అందించాలి
ఆర్అండ్ఆర్ ప్రక్రియలో ఒంటరి మహిళలు, ఒంటరి పురుషులను ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించకపోవడంతో వారు పునరావాస ప్రయోజనాలకు దూరమయ్యారని తెలిపారు. ఈ సమస్యపై కొందరు కోర్టును ఆశ్రయించగా, ఒంటరి మహిళలు, పురుషులను ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించాలనే అంశంపై అనుకూల తీర్పు వచ్చినప్పటికీ, కోర్టును ఆశ్రయించని అర్హులకు మాత్రం ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కూడా ప్రత్యేక కుటుంబాలుగా గుర్తింపు కల్పించి, పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, ఇళ్లు, ఇంటి స్థలాలు అందించాలని కోరారు. కోర్టు తీర్పు స్ఫూర్తితో అర్హులైన వారందరికీ సమాన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పునరావాస కాలనీల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని సామాజిక వర్గాలకు అనువైన శ్మశానవాటికలు, పాఠశాలలు, ఆలయాలు నిర్మించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని, ఇళ్ల నిర్మాణ అనుమతులు సులభతరం చేయాలని, మున్సిపల్ పన్నుల నుంచి పదేళ్లపాటు మినహాయింపు కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాడు నిర్వాసితుల కోసం దీక్ష.. నేడు పరిష్కారం కోసం ఎదురుచూపులు
మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు తమ హక్కుల కోసం పోరాడిన సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. అప్పట్లో ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిర్వాసితుల పక్షాన రెండు రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారని పేర్కొన్నారు. అదే చిత్తశుద్ధితో ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం కనిపించడం లేదన్నారు. ప్రజాభవన్ నుంచి మండల రెవెన్యూ అధికారి కార్యాలయం వరకు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని తెలిపారు.



ఎన్నికల సమయంలో మద్దతు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. తమకు రాజకీయ ప్రయోజనాలు అవసరం లేదని, న్యాయంగా దక్కాల్సిన పరిహారం, పునరావాస హక్కులు మాత్రమే కావాలని స్పష్టం చేశారు.

మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రి హామీ ఏమైంది?
ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిర్వాసితుల సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఆ హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. హామీలు ప్రకటనలకే పరిమితం కాకుండా, వాటి అమలుకు అధికారులు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్దిపేట పర్యటన సందర్భంగా నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పెండింగ్ పరిహారాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, ఇళ్ల కేటాయింపులు, ఇంటి స్థలాలు, పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు, ఒంటరి మహిళలు, పురుషులకు ప్రత్యేక కుటుంబాల గుర్తింపు వంటి అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. సమస్యల వారీగా కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోతే మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో మరో దశ ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా హక్కుల సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, అర్హులైన ప్రతి కుటుంబానికి పరిహారం, పునరావాస ప్రయోజనాలు అందే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.


గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి
బహిరంగ లేఖ
మల్లన్న సాగర్ భూ నిర్వాసితులు.

విద్యా సుగంధాల పరిమళం..!

వీపనగండ్ల విద్యాభివృద్ధికి పునాది వేసిన ఎయిడెడ్ హైస్కూల్

వంగూరు కృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రత్యేక కథనం

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

గత చరిత్రను నెమరువేసుకోవడం, వాస్తవాలను తెలుసుకోవడం, అనుభవాలను పంచుకోవడం, భవిష్యత్తు అభివృద్ధికి చేయూతనివ్వడం అనే ఉద్దేశంతో ఈ వ్యాసాన్ని అందిస్తున్నాం. దశాబ్దాల క్రితం వీపనగండ్ల ప్రాంతంలో విద్యా సుగంధాలను వెదజల్లేందుకు పురుడు పోసుకున్న ఓ మహత్తర విద్యా సంస్థ చరిత్రను మరోసారి గుర్తుచేసుకుందాం.ఒక గ్రామం లేదా వ్యవస్థ ఆర్థికంగా, విద్యాపరంగా, వైద్యపరంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన వ్యక్తులు, నాయకులు అవసరం. కేవలం జ్ఞానం, సంపద ఉంటే సరిపోదు. సామాజిక స్పృహ, నిబద్ధత, దూరదృష్టి కలిగిన నాయకత్వం ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది.ప్రజా ఉద్యమాలకు అడ్డాగా, జానపద కళాకారులకు, కవులకు, సాహిత్య ప్రియులకు నిలయంగా, రాజకీయాలకు అతీతంగా శాంతి సౌభ్రాతృత్వాలతో విరాజిల్లుతున్న ప్రాంతం వీపనగండ్ల మండల కేంద్రం. అయితే దశాబ్దాలు గడిచినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నది వాస్తవం. ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి, సామాజిక అభివృద్ధికి ప్రధాన భూమిక పోషించిన సంస్థగా అప్పటి ఎయిడెడ్ హైస్కూల్ (ూూూ)ను ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ఉన్నత విద్యకు దూరమైన గ్రామీణ ప్రాంతం

ఒకప్పుడు వీపనగండ్ల పరిసర గ్రామాల్లో ఉన్నత విద్యా అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండేవి కావు. ఉన్నత చదువులు చదవాలంటే కొల్లాపూర్, వనపర్తి వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అక్కడ హాస్టళ్లలో ఉంటూ విద్యను అభ్యసించేవారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఈ ఇబ్బందులను గుర్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కీ.శే. వంగూరు కృష్ణారెడ్డి విద్యాభివృద్ధికి నడుం బిగించారు.విద్యపై ఉన్న ప్రేమతో, పదిమందికి చదువు పంచాలనే సంకల్పంతో 1960-61 సంవత్సరంలో వీపనగండ్లలో ఎయిడెడ్ హైస్కూల్‌ను స్థాపించేందుకు శ్రీకారం చుట్టారు. తన సొంత ఖర్చులతో పాటు సహచరులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలను ప్రారంభించి విద్యా వ్యాప్తికి విశేష కృషి చేశారు.బియ్యం,



వడ్లు, నగదు రూపంలో విరాళాలు సేకరించి ఐదో తరగతి నుంచి ఉన్నత తరగతుల వరకు పాఠశాలను నిర్వహించారు. రెండు ఎకరాల స్థలాన్ని సేకరించి ఐదు గదులను నిర్మించారు. ఉపాధ్యాయులను నియమించి బోధన ప్రారంభించారు.అంతేకాకుండా పేద విద్యార్థుల కోసం 25 మందితో హాస్టల్‌ను ప్రారంభించి వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం విశేషం.

వందలాది మంది విద్యార్థులకు విద్యాబోధన

కాలక్రమేణా పాఠశాల అభివృద్ధి చెందింది. 1968లో హయ్యర్ సెకండరీ గ్రేడ్‌గా 25 మంది విద్యార్థులతో ప్రారంభమైన తరగతులు, తర్వాత దాదాపు 200 మందికి పైగా విద్యార్థులతో కళకళలాడాయి. అప్పటి ప్రభుత్వాలు కూడా ఎయిడెడ్ హైస్కూల్‌కు గ్రాంట్లు మంజూరు చేసి సహకరించాయి.పాఠశాల కరస్పాండెంట్‌గా వంగూరు కృష్ణారెడ్డి వ్యవహరించారు.ప్రధానోపాధ్యాయులుగా అనంతపురానికి చెందిన వెంగళప్ప, అనంతరం వంగూరు విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి పనిచేశారు.ఉపాధ్యాయులుగా ఎం. నారాయణ, లక్ష్మారెడ్డి, బసవయ్య, వెంకటరెడ్డి, దామోదరాచారి తదితరులు సేవలందించారు. శేఖర్ రెడ్డి వీఈటీగా పనిచేశారు. దామోదరాచారి, బ్రహ్మయ్య, శేషు పణిశర్మ తదితరులు కూడా విద్యాబోధనలో తమ వంతు పాత్ర పోషించారు.కే. శివయ్య, వి. సుగుణారెడ్డి, రాముడు, శేషయ్య, లింగస్వామి తదితరులు బోధనేతర సిబ్బందిగా సేవలందించారు. అప్పట్లో కేవలం రూ. 70 నుంచి రూ. 100 వరకు వేతనాలు పొందుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేయడం వారి అంకితభావానికి నిదర్శనం.

ప్రభుత్వ పాఠశాలలో విలీనం కోసం కృషి

1964లో ఎయిడెడ్ హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు చారిత్రక వివరాలు పేర్కొంటున్నాయి. అనంతరం పాఠశాల నిర్వహణలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. 2000 జూలైలో కరస్పాండెంట్ వంగూరు కృష్ణారెడ్డి మరణించడంతో అప్పటి డిప్యూటీ డీఈవో ఉషారాణి, ఆర్. పాపారావు స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ పాఠశాల నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.అనంతరం సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి. లక్ష్మారెడ్డి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలను జిల్లా పరిషత్ పరిధిలో విలీనం చేయించేందుకు విశేషంగా కృషి చేశారు. అప్పటి శాసనసభ్యులు కె మధుసూదన్ రావు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యంతో ఎట్టకేలకు 2004లో ఎయిడెడ్ పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.ప్రధానోపాధ్యాయులుగా తొలుత నారాయణ, అనంతరం బి. లక్ష్మారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. అప్పటి నుంచి పాఠశాల క్రమంగా అభివృద్ధి చెందుతూ వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించే కేంద్రంగా మారింది.

ఎందరికో జీవితాలను మార్చిన విద్యాలయం

ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ప్రగతిశీల భావాలు, సామాజిక స్పృహ, ఆదర్శవంతమైన జీవితాలతో కొందరు ప్రజా ఉద్యమాల్లో, ప్రజా సంఘాల్లో నాయకులుగా, రచయితలుగా, కవులుగా, కళాకారులుగా తమదైన గుర్తింపు పొందారు.వీపనగండ్ల ప్రాంతానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడంలో ఈ విద్యాసంస్థ పాత్ర ఎంతో కీలకమైనది. ఒకప్పుడు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, ఈ పాఠశాల ఏర్పాటుతో స్థానికంగానే విద్యను అభ్యసించే అవకాశం వేలాది మంది విద్యార్థులకు లభించింది. **పాఠశాల అభివృద్ధికి అందరి బాధ్యత**

ఎక్కడ విద్య అందుబాటులోకి వస్తుందో అక్కడ అక్షరాస్యత పెరుగుతుంది. విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు, సామాజిక చైతన్యం, నైతిక విలువలు, అభివృద్ధి కూడా విస్తరిస్తాయి. మార్క్స్, అంబేద్కర్, వివేకానందుల ఆలోచనలు కూడా విద్య ప్రాధాన్యతను చాటిచెబుతాయి.ఇంతటి చారిత్రక నేపథ్యం కలిగి, ప్రాంత విద్యాభివృద్ధికి పునాది వేసిన ఈ పాఠశాలను మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులపై ఉంది.ప్రభుత్వం కూడా ఇలాంటి చారిత్రక విద్యాసంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, ఆధునిక విద్యా సౌకర్యాలు కల్పించాలి. పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి.విద్యా సుగంధాలను దశాబ్దాలుగా ఈ ప్రాంతమంతా వ్యాపింపజేసిన ఎయిడెడ్ హైస్కూల్ చరిత్రను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత. వంగూరు కృష్ణారెడ్డి వంటి విద్యా దాతల సేవలను స్మరించుకుంటూ, వారు చూపిన బాటలో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలి.ఖ



మద్యానికి బానిసై గొర్రెల చోరీ నిందితుల అరెస్టు...

- రిమాండ్ కు తరలింపు....

- ఎస్సై కీర్తి రాజు

ప్రజా వాయిస్ /దుబ్బాక :

మద్యానికి బానిసై, జల్సాలు చేసేందుకు గొర్రెలను చోరీ చేసి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించినట్లు దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపారు. ఇటీవల దుబ్బాక మండలంలోని రామక్కపేట, పెద్ద చీకోడ్ శివారులోని గొర్రెల కొట్టం నుంచి గుర్తుతెలియని దొంగలు ఎనిమిది గొర్రెలను చోరీ చేశారు. ఈ క్రమంలో ప్రతి శనివారం దుబ్బాకలో జరిగే మూగజీవాల సంతలో గొర్రెలను విక్రయించేందుకు ఇద్దరు గుర్తు తెలియ వ్యక్తులు గొర్రెలను ఆటోలో తీసుకువచ్చారు. వారి మాటలను, అనుమానస్పద కదలికలను గుర్తించిన దుబ్బాక పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని, తమదైన శైలిలో విచారించగా, తామే రెండుచోట్ల గొర్రెలను చోరీ చేసినట్లు అంగీకరించారు. ఇద్దరు నిందితులను దుబ్బాక పట్టణానికి చెందిన పి. శ్రీనివాస్, వి.నాగరాజు గా గుర్తించి, కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కు తరలించారు. నిందితుల వద్ద నుంచి ఒక ఆటో, మూడు గొర్రెలు, ఒక మేకను స్వాధీనం చేసుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

విహెచ్పిఎస్ అధ్యక్షుడు నవీన్ కుమార్ డిమాండ్

ప్రజా వాయిస్ / దుబ్బాక:



మెదక్ జిల్లాలోని నర్సాపూర్ రోడ్డులో చింతలకుంట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని విశ్వకర్మ హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) అధ్యక్షుడు వేములవాడ నవీన్ కుమార్ డిమాండ్ చేశారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేయడం విశ్వకర్మ సమాజం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ పునర్నిర్మాణంతో పాటు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని విశ్వకర్మ సంఘానికి హామీ ఇచ్చారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిందితులను వెంటనే గుర్తించి చట్టపరంగా శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో విశ్వబ్రాహ్మణులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యుడికి ఘన నివాళి..డాక్టర్ బాలకృష్ణయ్య సేవలు చిరస్మరణీయం

పేదల పాలిట ఆపద్బాంధవుడు..

బీసీల ఆరాధ్య నాయకుడు డాక్టర్ బాలకృష్ణయ్య

ఆయనలాంటి ప్రజాసేవకులు మళ్లీ రావాలి

అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

ప్రజా వాయిస్.. వనపర్తి



పేద ప్రజలకు నిస్వార్థ వైద్యసేవలు అందించి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మాజీ శాసనసభ్యులు డాక్టర్ బాలకృష్ణయ్య సేవలు చిరస్మరణీయమని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు.మొదట అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థినులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్ బాలకృష్ణయ్య విగ్రహానికి డాక్టర్ సతీష్ యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ భూపేష్ ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి వైద్యుడు అనగానే ముందుగా గుర్తుకొచ్చే పేరు డాక్టర్ బాలకృష్ణయ్య అని అన్నారు. ఎలాంటి ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులో లేని రోజుల్లోనే రోగి చేయి పట్టుకుని నాడి చూసి వ్యాధిని గుర్తించే అసాధారణ వైద్య నైపుణ్యం ఆయన సొంతమని కొనియాడారు. పేదలు, చిన్నపిల్లలు చికిత్స కోసం వస్తే డబ్బుల కోసం పట్టుబట్టకుండా, వారు ఇచ్చినది స్వీకరిస్తూ వైద్యం అందించిన గొప్ప మనసున్న వైద్యుడని గుర్తుచేశారు.వైద్యసేవలతో పాటు రాజకీయ రంగంలోనూ బీసీ వర్గానికి చెందిన శాసనసభ్యుడిగా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. ఆయన తర్వాత వనపర్తి నుంచి మరో బీసీ ఎమ్మెల్యే ఎన్నిక కాలేదని ప్రస్తావించారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే మహోన్నత వ్యక్తులు నేటి సమాజానికి ఎంతో అవసరమని, డాక్టర్ బాలకృష్ణయ్య లాంటి ప్రజానాయకుడు మళ్లీ ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, పేదల కోసం పనిచేసే నాయకత్వాన్ని ప్రజలు కోరుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ యాదవ్, డాక్టర్ భూపేష్, డాక్టర్ శాంతిని రాణి, విజయకుమారి, ఉదయశ్రీ, కె. కృష్ణయ్య, గంధం బాలపిరు, మదన్మోహన్ సింగ్, జి.టి. తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, గంధం నాగరాజు, కొత్తగొల్ల శంకర్, రాజ్ కుమార్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



సొంత నిధులతో ఛట్ పూజ, బతుకమ్మ ఘాట్ కోసం నీటి కాలను నిర్మాణం

రూ.2.50 లక్షలతో గుండం ఏర్పాటు..

గద్దె సుష్మా గణేష్, గండి స్వప్న కుమార్ యాదవ్ చొరవ

బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక ఏర్పాటు

ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ

జిన్నారం ప్రజావాయిస్

జిన్నారం మండలం ఖాజిపల్లి గ్రామ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో నివసిస్తున్న బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజల ఇబ్బందులను గుర్తించి, వారి పవిత్ర పండుగ అయిన ఛట్ పూజ నిర్వహణకు అవసరమైన సంప్ (గుండం) ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ అన్నారు. కాలనీలో వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక కుటుంబాలు స్థిరపడి జీవిస్తున్నాయని, ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా ఛట్ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారని తెలిపారు. అయితే ఛట్ పూజ సందర్భంగా అస్తమించే, ఉదయించే సూర్య భగవానుడికి నీటిలో నిలబడి అర్ఘ్యం సమర్పించేందుకు అనువైన నీటి గుండం లేకపోవడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో చైర్మన్ గద్దె సుష్మా గణేష్, గండి స్వప్న కుమార్ యాదవ్ తమ సొంత నిధుల నుంచి రూ.2,50,000 వెచ్చించి సంప్ (గుండం) నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఛట్ పూజతో పాటు బతుకమ్మ పండుగ నిర్వహణకు కూడా ఈ గుండం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజల ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి పండుగల నిర్వహణకు అవసరమైన సౌకర్యం కల్పించడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ ఉపయోగపడేలా సొంత నిధులతో రూ.2.50 లక్షలు వెచ్చించి ఈ సౌకర్యాన్ని కల్పించిన చైర్మన్ గద్దె సుష్మా గణేష్, గండి స్వప్న కుమార్ యాదవ్‌లను కాలనీవాసులు అభినందించారు. ఈ గుండం అందుబాటులోకి రావడంతో ఛట్ పూజను మరింత సౌకర్యవంతంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే అవకాశం ఉంటది అన్నారు





18 ఏళ్ల తర్వాత చదువులమ్మ ఒడిలో..స్నేహితుల సందడి.!

2007-08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం

పాత జ్ఞాపకాల నెమరువేత.. ఆటపాటలు, నృత్యాలతో సందడి

ప్రజా వాయిస్,మునగాల:

అక్షరాలు దిద్దిన బడి,జీవితానికి బాటలు వేసిన పాఠశాల,చిన్ననాటి స్నేహాలకు చిరునామా అయిన ఆ ప్రాంగణం మరోసారి నవ్వులతో కళకళలాడింది. 18 ఏళ్ల తర్వాత చదువుకున్న బడిలోనే పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి ఆత్మీయతను పంచుకున్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2007-08 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.చాలా కాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలు, ఉపాధ్యాయుల మందలింపులు, స్నేహితులతో చేసిన అల్లరి, మరపురాని సంఘటనలను గుర్తుచేసుకుంటూ మధురానుభూతులకు లోనయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు మార్గదర్శనం చేసిన అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాటలు, నృత్యాలతో సందడి చేస్తూ చిన్ననాటి రోజులను మరోసారి కళ్లముందు ఆవిష్కరించుకున్నారు.ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు మధుసూదన్, కృష్ణయ్య, రామిరెడ్డి, బ్రహ్మానందం, మౌలానా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ, నిడమనూరు బార్ అసోసియేషన్లకు రాష్ట్రస్థాయి గుర్తింపు

తెలంగాణ బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ నూతన కార్యవర్గంలో కీలక పదవులు కైవసం

ప్రజా వాయిస్, మిర్యాలగూడ.

మిర్యాలగూడ, నిడమనూరు: ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ 2026-27 నూతన కార్యవర్గంలో మిర్యాలగూడ, నిడమనూరు బార్ అసోసియేషన్లకు చెందిన న్యాయవాదులకు కీలక పదవులు దక్కాయి. మిర్యాలగూడ బార్ అసోసియేషన్‌కు చెందిన గౌరు వెంకటేశ్వర్లు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, రాయారపు భాస్కర్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. అదేవిధంగా నిడమనూరు బార్ అసోసియేషన్‌కు చెందిన మువ్వ అరుణ్ కుమార్ వైస్ ప్రెసిడెంట్‌గా, పెద్దబోయిన శ్రీనివాస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.రెండు బార్ అసోసియేషన్లకు రాష్ట్రస్థాయి ఫెడరేషన్‌లో కీలక బాధ్యతలు దక్కడం పట్ల న్యాయవాద వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికలు ఆయా బార్ అసోసియేషన్లకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు న్యాయవాదులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి, న్యాయవాదుల సంక్షేమానికి మరింత కృషి జరగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని శుభాభిలాషులు కోరారు.





క్రమశిక్షణ, పట్టుదలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు: ముధోల్ సీఐ రవీందర్ నాయక్

ముధోల్‌లో నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన..

31 పాఠశాలల నుంచి 998 మంది హాజరు

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ముధోల్ సీఐ రవీందర్ నాయక్ పేర్కొన్నారు.ఆదివారం మండల కేంద్రమైన ముధోల్‌లోని రభీంద్రా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ నమూనా పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది.31 పాఠశాలల నుంచి 998 మంది విద్యార్థులు:ఈ నమూనా పరీక్షకు ఉమ్మడి జిల్లా పరిధిలోని 31 పాఠశాలల నుంచి మొత్తం 998 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.పరీక్షల్లో వచ్చే ఫలితాలను చూసి విద్యార్థులు ఎప్పుడూ నిరుత్సాహపడకూడదని సూచించారు.అపజయాలనే విజయానికి మెట్లుగా మార్చుకుని,సరైన ప్రణాళికతో చదువుకోవాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.40 నిమిషాల్లోనే ఫలితాలు.ఈ నమూనా పరీక్ష నిర్వహణకు మెరిట్ ఇక్రా ఫౌండర్ వీరభద్ర ధర్మపురి సాంకేతిక సహకారం అందించారు.సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్ష ముగిసిన కేవలం 40 నిమిషాల్లోనే ఫలితాలను వెల్లడించడం విశేషం.అనంతరం పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, టస్మా (ఫాపా) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగౌడ్, ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్ మండల రైతులకు ముఖ్య గమనిక!

యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయండి..

సబ్సిడీ విత్తనాలు పొందండి.. ఏఓ రాంప్రసాద్



ప్రజా వాయిస్ టేక్మాల్ :

యాసంగి సీజన్‌లో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలనుకునే రైతులు వెంటనే తమ వివరాలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని టేక్మాల్ ఏఓ రాంప్రసాద్ సూచించారు.

సబ్సిడీపై విత్తనాలు అందించే పంటలు:

- మొక్కజొన్న
- కుసుమ
- పొద్దుతిరుగుడు
- నువ్వులు
- పెసలు
- మినుములు
- వేరుశనగ
- కూరగాయలు తదితర పంటలు.

రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు ఏఓ తెలిపారు.కావున టేక్మాల్ మండలంలోని ఆసక్తి గల రైతులందరూ వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరడమైనది.

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తుంది

ఎమ్మెల్యే రేవూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ భవానీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం



ముందుకు సాగుతోందన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం రోజురోజుకూ పెరుగుతోందని, కాంగ్రెస్ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బి ఆర్ ఎస్ మాజీ వార్డు సభ్యులు చెన్న వెంకటేశ్వర్లు, సముద్రాల రాజు, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుత్తికొండ సురేందర్, దండు రవి ,నాగరాజ్, కొత్త నాగరాజ్, గోవిందు రాజు, గుంపలపల్లి రాజు, కందగట్ల శ్రీనివాస్, దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుబాసి రాజేందర్, మన్నెం ప్రకాశ్ రెడ్డి, జిల్లా కమిటీ మెంబర్ గన్ను వెంకటేశ్వర్లు,గ్రామ కమిటీ అధ్యక్షులు పేరుక, రాజుమండల ప్రధాన కార్యదర్శి రాంబాబు, గోవిందు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...

ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు

నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

నిర్మల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలు సేవా,సంస్మరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయడంతో పాటు,గిరిజన ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు.210 మందికి రూ.56.87 లక్షల ఆర్థిక సాయం నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని నిర్మల్ పట్టణంతో పాటు నిర్మల్ రూరల్, సోన్,మామడ, లక్ష్మణచందా,సారంగాపూర్, దిలావర్‌పూర్,నర్సాపూర్ (జి) మండలాలకు చెందిన అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.మొత్తం 210 మంది లబ్ధిదారులకు రూ.56,87,000/- విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలను ఆదుకోవడానికే ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని, అర్హులైన



ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

బిర్సా ముండా పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

అంతకుముందు జనజాతీయ గౌరవ్ దివస్, భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్‌తో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు.ఆయన ఆశయాలను ఆదర్శంగా



తీసుకుని గిరిజనుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం.చంద్రకాంత్, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి,జిల్లా కార్యదర్శి పుస్పూర్ నర్సారెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పండిత్ జాదవ్,సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, రమణారెడ్డి, జమాల్, మేడిసెమ్మ రాజు,మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, కౌన్సిలర్లు గంజి రాజు, కూన శశాంక్, ఈశ్వర్, వివిధ మండలాల సర్పంచులు, నాయకులు వెంకటేష్, హరీష్, విజయ్, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు

సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దామోదర్ రాజనర్సింహ.

టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల్లో 1,386 మందికి నూతన చేయూత పింఛన్లు.రూ.31.84 లక్షలకుపైగా ఆర్థిక భరోసా..

ప్రజా వాయిస్ టేక్మాల్ :

సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన చేయూత పింఛన్ల కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేయగా, మెదక్ జిల్లాలోనే 11 వేల మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల్లో 1,386 మందికి రూ.31,84,176 వ్యయంతో పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీరిలో 965 మంది వితంతువులు, 166 మంది



ఒంటరి మహిళలు, 195 మంది దివ్యాంగులు, 60 మంది గీత కార్మికులు ఉన్నారని వివరించారు.కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు పింఛన్లు ఎంతో అండగా నిలుస్తాయని, ఆత్మగౌరవంతో జీవించేందుకు చేయూతనిస్తాయని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తోందన్నారు. బ్యాంకు లింకేజీతో పాటు ఇతర మార్గాల్లో లక్షల రూపాయల రుణ సదుపాయాలు కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, డ్రోన్ల నిర్వహణ వంటి రంగాల్లోనూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఏటా 3,800 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు 1,400 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 400 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి

టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, అందోల్ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు, నైపుణ్యం కలిగిన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, మెదక్ ఇన్‌చార్జి ఆర్డీఓ రామకృష్ణ, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాల ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సొంత నిధులతో ఛట్ పూజ, బతుకమ్మ ఘాట్ కోసం నీటి కొలను నిర్మాణం

రూ.2.50 లక్షలతో గుండం ఏర్పాటు.. గద్దె సుష్మా గణేష్, గండి స్వప్న కుమార్ యాదవ్ చొరవ

బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక ఏర్పాటు

ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ

జిన్నారం ప్రజావాయిస్

జిన్నారం మండలం ఖాజిపల్లి గ్రామ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో నివసిస్తున్న బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజల ఇబ్బందులను గుర్తించి, వారి పవిత్ర పండుగ అయిన ఛట్ పూజ నిర్వహణకు అవసరమైన సంప్ (గుండం) ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ అన్నారు. కాలనీలో వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక కుటుంబాలు స్థిరపడి జీవిస్తున్నాయని, ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా ఛట్ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారని తెలిపారు. అయితే ఛట్ పూజ సందర్భంగా అస్తమించే, ఉదయించే సూర్య భగవానుడికి నీటిలో నిలబడి అర్ఘ్యం సమర్పించేందుకు అనువైన నీటి గుండం లేకపోవడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో చైర్మన్ గద్దె సుష్మా గణేష్, గండి స్వప్న కుమార్ యాదవ్ తమ సొంత నిధుల నుంచి రూ.2,50,000 వెచ్చించి సంప్ (గుండం) నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఛట్ పూజతో పాటు బతుకమ్మ పండుగ నిర్వహణకు కూడా ఈ గుండం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజల ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి పండుగల నిర్వహణకు అవసరమైన సౌకర్యం కల్పించడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ ఉపయోగపడేలా సొంత నిధులతో రూ.2.50 లక్షలు వెచ్చించి ఈ సౌకర్యాన్ని కల్పించిన చైర్మన్ గద్దె సుష్మా గణేష్, గండి స్వప్న కుమార్ యాదవ్‌లను కాలనీవాసులు అభినందించారు. ఈ గుండం అందుబాటులోకి రావడంతో ఛట్ పూజను మరింత సౌకర్యవంతంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే అవకాశం ఉంటది అన్నారు



బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

చేయూతతో పేదలకు ఆత్మగౌరవ జీవితం

390 మంది లబ్ధిదారులకు పింఛన్

మంజూరు పత్రాల పంపిణీ

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్



ప్రజా వాయిస్ - వేములపల్లి

పేదలు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించాలనే గొప్ప లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చేయూత పింఛన్లను అందిస్తోందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని మొలకపట్నం గ్రామంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరైన 390 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పింఛన్లు పేదలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా వారి జీవనానికి భరోసా కల్పిస్తూ ఆత్మగౌరవంతో బతికేందుకు దోహదపడతాయని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వారు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, గృహజ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అలాగే రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించడం, రైతు బీమా ద్వారా రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సహాయం, విద్యా రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పేదలు, రైతులు, మహిళలు, యువత, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దండ జితేందర్ రెడ్డి ,ఎంపీ ఓ లలిత సర్పంచులు పిల్లల సందీప్, ఎలికట్టి భరత్,సందర బోయిన చంద్రయ్య, నారబోయిననతీష్, చక్కని ఉపేంద్రమ్మ, మమత, జెర్రిపోతుల మౌనిక, సైదులు, త్రివేణి, పుట్టల సందీప్, దేషి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బుర్రి లక్ష్మి, నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రేగట్టి రవీందర్ రెడ్డి, రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, ఆయాగ్రామల కార్యదర్శిలు, ఉప సర్పంచ్ లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు



ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు

ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా

ప్రజా వాయిస్ కొత్తగూడ

గోండు గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి కార్యక్రమాన్ని కొత్తగూడ మండలం, గోపాలపురం గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఎ టీ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కల్తీ ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం బిర్సా ముండా చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వాసం కృష్ణ కల్తీ పెద్ద గాధయ్య,కల్తీ పెద్ద వీరస్వామి సువర్ణపాక లక్ష్మయ్య,పెనకట్ల బుచ్చి రాములు,మేడ నరసయ్య,వ ట్టం రామచందర్, కల్తీ సారక్క, వాసం ఎల్లక్క, వట్టం సమ్మక్క కల్తీ అనసూరియా తదితరులు పాల్గొన్నారు.

కీసర దయారలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..

పేదోడి గూడు కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం,

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

ప్రజావాయిస్, కీసర :

మేడ్చల్ జిల్లా కీసర దాయరలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు, యూజీడీ (ఖ+ణ) నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీసర సర్కిల్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం లొనే సాధ్యమన్నారు. అదేవిధంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యలు తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ గౌడ్, సెక్రటరీ నర్సింగ్ రావు, కీసర సర్కిల్ జనరల్ సెక్రటరీ తటాకం లక్ష్మణ్ శర్మ, శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారి నవీన్, సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కోల కృష్ణ, దయానంద గౌడ్, అల్లాదుర్గం కృష్ణ, హనుమంత్ రెడ్డి, మహేష్ గౌడ్, సాయి రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

పేద కుటుంబం వివాహానికి అండగా నిలిచిన రుద్రారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి

రుద్రారం గ్రామానికి చెందిన మంగలి జంగయ్య

కుమార్తె వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేత

(ప్రజా వాయిస్ షాబాద్)



పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకుని వారి కుటుంబ శుభకార్యాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి భగవంతుడి ఆశీస్సులతో, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఆయన 13వ సారి ఓ పేద యువతి వివాహానికి పుస్తె, మెట్టెలను బహూకరించి తన ఉదారతను చాటుకున్నారు. షాబాద్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన మంగలి జంగయ్య కుమార్తె వివాహం సందర్భంగా ఆ కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితిని గుర్తించిన గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి స్వయంగా వెళ్లి వధువు కోసం పుస్తె, మెట్టెలను అందజేశారు పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నా వంతుగా చిన్న సహాయం చేయాలనే ఉద్దేశంతో భగవంతుడి ఆశీస్సులతో ఇప్పటివరకు 13 మంది పేద ఆడబిడ్డల వివాహాలకు పుస్తె, మెట్టెలు బహూకరించడం జరిగింది. ఆపదలో ఉన్న వారికి, పేద కుటుంబాల శుభకార్యాలకు అండగా నిలవడం ఎంతో ఆత్మతృప్తినిస్తుంది. భవిష్యత్తులోనూ నా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగుతాయి ఈ సందర్భంగా వివాహ శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వధూవరులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆపద సమయంలో ఆదుకున్న విష్ణువర్ధన్ రెడ్డికి మంగలి జంగయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు మానసిక ఒత్తిడితో రైతు ఆత్మహత్య

షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో విషాదం

(ప్రజా వాయిస్ షాబాద్)



షాబాద్ మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పొలంలో పత్తి ఏరేందుకు వెళ్లిన రైతు చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామానికి చెందిన చెర్లగూడెం వెంకటయ్య (45), తన భార్య వరలక్ష్మితో కలిసి 15.11.2026న మన్‌మర్రి గ్రామ పరిధిలోని తమ వ్యవసాయ పొలానికి పత్తి ఏరేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 10 గంటల సమయంలో వెంకటయ్య పొలం నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఉదయం 10:30 గంటల సమయంలో ఆయన భార్య వరలక్ష్మి నేరేడు చెట్టు కిందకు వెళ్లి చూడగా, వెంకటయ్య చెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని మృతి చెంది ఉండటాన్ని గుర్తించింది. దీంతో ఆమె తీవ్ర ఆవేదనకు గురైంది కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెంకటయ్య కొంతకాలంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు ఆయన భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది సమాచారం అందుకున్న షాబాద్ పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. రైతు మృతితో బోడంపహాడ్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సినిమా షూటింగ్ లో నారాయణపురం యువకులు

సమవర్తి సినిమాలో వివిధ పాత్రలలో నటులుగా

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం







సినీ హీరో సత్యదేవ్,సీనియర్ నటుడు శ్రీకాంత్ నటిస్తున్న సినిమా డైరెక్టర్ అజయ్ దేవ్ నిర్మిస్తున్న సమవర్తి మూవీ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగాపురం సాయి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినిమా షూటింగ్ లో భాగంగా చిన్నచిన్న పాత్రలను నారాయణపురంలో కలని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి కళాకారులు ఈ యొక్క పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన సినిమాలో నటులుగా గంగాపురం సాయి గౌడ్, శికిలమెట్ల ప్రభాకర్, అందే నరేష్, బైకని నరేందర్ యాదవ్, పాలకూర్ల శివ, కొండ అయాన్ గౌడ్ నటించడం జరిగింది..ఈ యొక్క పాత్రలలో అడవులలో వన్యప్రాణులు ఉండడంతో ఆ ప్రాంతమంతా సంచరించే చిత్రాలను ఫారెస్ట్ అధికారులుగా, రైతుల పాత్రలలో వివిధ వేషధారాలు వేయడం జరిగింది..అలాగే అమ్మ,అక్క, తమ్ముడి మధ్య జరిగే చిత్రాలను చిత్రీకరించారు. ఇలాంటి కల నైపుణ్యాన్ని తెరమీదకి మీలాంటి వారు నటీనటులుగా ముందుకు సాగాలని డైరెక్టర్ అజయ్ దేవ్,డైరెక్టర్ నాగరాజు కొనియాడారు. ఆయన చిత్రంలో నటించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.



నవంబర్ 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జయప్రదం చేయండి

పిడిగం నాగయ్య ముదిరాజ్

తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ప్రజా వాయిస్ :హాలియా

మండల కేంద్రం లో తెలంగాణా ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నవంబర్ 21 న జరుపుకునే ప్రపంచ మత్స్య కార్మికులదినోత్సవం గోడ పత్రిక ను తెలంగాణా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు వెలుగు రవి ముదిరాజ్.నల్గొండ జిల్లా మత్స్య కార్మిక సంఘం చైర్మన్ కనుకు వెంకటనారాయణ ముదిరాజ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల నవంబర్ 21 వ తారీఖున జరుగు ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం మరియు తెలంగాణ ముదిరాజ్ మహాసభ 12వ వార్షికోత్సవం సందర్భంగా మత్స్య కార్మికులు ముదిరాజులు గ్రామ గ్రామాన మత్స్యకారుల జెండా ఆవిష్కరణ చేసి గ్రామాలలో ముదిరాజుల డిమాండ్ అయినా బిసి డి నుంచి ఎ లోకి మార్చాల్సిన ఆవశ్యకత గురించి తెలంగాణ రాష్ట్రంలో సామాజికపరంగా అతిపెద్ద కులమైన ముదిరాజులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఇంతవరకు నయా పైసా ఇవ్వలేదు కావున 1000కోట్ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు అదేవిధంగా ఎల్ నీనో వల్ల రాష్ట్రంలో కరువు సంభవించి చెరువుల ఎండిపోయి మత్స్య సంపద లేనందువల్ల ప్రభుత్వం తక్షణమే స్పందించి మత్స్య శాఖ ద్వారా సర్వే చేయించి మత్స్యకారులకు జీవన భృతి కల్పించాలని చాపల వేట ద్వారా రెక్కాడితే డొక్కాడని మత్స్యకారులను ఆర్థికంగా ప్రభుత్వం గ్రాంట్ రూపంలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు నాశబోయిన వెంకటేశ్వర్లుముదిరాజ్ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు యాలకాని వెంకటేశ్వర్లుముదిరాజ్ హాలియా టౌన్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పుట్ట దుర్గా ప్రసాద్ ముదిరాజ్ ముదిరాజ్ ఉద్యోగులసంఘం మాజీ నాయకులు దుగ్యాల రాములు ముదిరాజ్ పుట్ట వెంకటేశ్వర్లు ముదిరాజ్ బైరు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు



భగవాన్ బిర్సా ముండా చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్

ప్రజా వాయిస్ కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో నిర్వహించిన భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. గత పాలకులు ఆదివాసీలను గూడాలు, తండాలకే పరిమితం చేసి చూశారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గిరిజనుల చరిత్ర, వారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన నాయకుడని కొనియాడారు. భగవాన్ బిర్సా ముండా చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు ఆదివాసీల పోరాట స్ఫూర్తిని తెలియజేయాలన్నారు. తుపాకులు పట్టి జీవితాలను నాశనం చేసుకోవద్దని, నక్సలిజాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు విద్య, అభివృద్ధి, నాగరికతలో ముందుకు సాగుతూ సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బిర్సా ముండా జయంతి సందర్భంగా కళా ప్రదర్శన చేసిన విద్యార్థులకు మొదటి బహుమతులు రెండవ బహుమతులు ప్రదర్శించడం జరిగింది. మొదటి బహుమతి ఈఎంఆర్ ఎస్ గురుకుల పాఠశాల రెండవ బహుమతిగా గిరిజన ఆశ్రమ పాఠశాల కొత్తగూడ విద్యార్థులు తీసుకోవడం జరిగింది. బహుమతులు అందుకున్న ప్రతి విద్యార్థి విద్యార్థులను ఎంతగానో జాటోత్ హుస్సేన్ నాయక్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పి ఓ జిల్లా ఉన్నత అధికారులు, మండల అధికారులు ఉపాధ్యాయ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ బోడ స్వామి, నవీన్ నాయక్, కొట్టే శ్రీను, భూపతి తిరుపతి, తోటకూరి మధు, ప్రవీణ్, ఉమ్మడి మండల బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కుసంగిలో ఘనంగా సామూహిక అగ్నిహోత్ర కార్యక్రమం

పర్యావరణ పరిరక్షణ, మానసిక ప్రశాంతత, సానుకూలం.. సంఘమేశ్వర్

ప్రజా వాయిస్ టేక్మాల్ :

కుసంగి గ్రామంలో విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సూర్యోదయ అగ్నిహోత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ అగ్నిహోత్రం ద్వారా పర్యావరణ పరిరక్షణ, మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు పెంపొందుతాయని తెలిపారు. ప్రాచీన వేద విజ్ఞానమైన అగ్నిహోత్రంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా విశ్వ ఫౌండేషన్ సభ్యులకు సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్, మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాయపడిన మాజీ ఎంపీటీసీకి ఆర్థిక సాయం

ప్రజావాయిస్/కోట్ పల్లి:



బైక్ ప్రమాదంలో గాయపడి వికారాబాద్‌లోని అనంతరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరీంపూర్ మాజీ ఎంపీటీసీ మాల బంధయ్యను కోట్‌పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సుందరి అనిల్ పరామర్శించారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, తన వంతు సహాయంగా రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సర్పంచ్ హుస్సేన్, యూత్ నాయకులు తదితరులు బంధయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ ఐలయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యేల్లం సంజీవ రెడ్డి

భువనగిరి, నవంబరు 15(ప్రజా వాయిస్):-

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బైపాస్ రోడ్డులోని వి కన్వెన్షన్ హాల్‌లో మోటకొండూరు మండలం నాంచారిపేట గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు పిసరి శ్రీకాంత్ రెడ్డి, భామర్ది నవీన్ వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లంల సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఘనంగా ఆశీర్వదించి, దంపతులు అన్యోన్యంగా, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లుదాని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి బీర్ల ఫౌండేషన్ చేయూత

మోటకొండూరులో నూతన వధూవరులకు పెళ్లి కానుక అందజేత

పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు

మోటకొండూరు, నవంబరు 15(ప్రజా వాయిస్):-

మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మహమ్మద్ జాంగిర్ కూతురు వివాహం సందర్భంగా బీర్ల ఫౌండేషన్ భరోసానిచ్చింది. ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో పేదింటి ఆడపడుచు వివాహానికి తన వంతు సహాయంగా పెళ్లి కానుకను మోటకొండూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితురాలి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బుగ్గ కొమరయ్య, ఉపసర్పంచ్ వంగాల మహేందర్, వార్డు సభ్యులు బాల్ద మధు, ఆత్మ కమిటీ డైరెక్టర్ రేగు రమేష్, సీనియర్ నాయకులు భూమండ్ల ఇస్తారి, మోటే మల్లేష్, ఎత్తరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో గడ్డి లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం దగ్ధం,

విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డికి అంటుకున్న మంటలు, తప్పిన ప్రాణాపాయం..

ట్రాఫిక్ జామ్ లో అగ్నిమాపక వాహనం, కీసరలో నిత్యం రద్దీ, ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాలంటున్న స్థానికులు,

ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు ?

కీసర డివిజన్,సర్కిల్ కావడంతో నిత్యం రద్దీ

ప్రజావాయిస్, కీసర :

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసరలో గడ్డి లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెదక్ నుంచి కీసరకు గడ్డిని తరలిస్తున్న క్రమంలో డీసీఎం వాహనంపై ఉన్న గడ్డికి విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించి గడ్డి మొత్తం పూర్తిగా దగ్ధమైంది.ఈ ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు, స్థానికులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే గడ్డి మొత్తం కాలిపోవడంతో భారీగా ఆస్తినష్టం సంభవించింది. రహదారులపై విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు విద్యుత్ తీగల ఎత్తును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





కీసరలో ట్రాఫిక్ జామ్.. అగ్నిమాపక వాహనానికి దారేది ?

అత్యవసర సమయాల్లోనూ ట్రాఫిక్ చిక్కులు..

ప్రజల ప్రాణాలకు ముప్పు!

కీసరలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారులపై వాహనాల రద్దీతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో అత్యవసర సేవలకు సైతం ఆటంకం ఏర్పడుతోంది.తాజాగా గడ్డి లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య మరోసారి చర్చనీయాంశంగా మారింది. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకోవాల్సిన అగ్నిమాపక వాహనాలకు ట్రాఫిక్ కారణంగా దారి లేకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. అత్యవసర సమయంలో అగ్నిమాపక వాహనాలకే దారి లేకపోతే ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ ఎలా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి రద్దీ ప్రాంతాలను గుర్తించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అగ్నిమాపక, అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేక మార్గం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు...కీసరలో ప్రధాన రోడ్డులో ఇరుపక్కల వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిసగిస్తున్నారని, అధికారులు పూర్తి విచారణ చేసి , రోడ్డుపై అక్రమంగా రోడ్డుపై వ్యాపారాలు చేసేవాటిని తొలగించాలని కోరుతున్నారు... కార్తీకమాసం వేళా సుప్రసిద్ధమైన శివాలయం కీసర గుట్టకు భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి వస్తారని, గుట్టకి వచ్చే భక్తులు వారి వాహనాలతో నిత్యం కీసరలో ట్రాఫిక్ ఏర్పడుతుందని , స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్న ప్రజలు. కీసర డివిజన్ తోపాటు సర్కిల్ కావడంతో ఇక్కడికి ప్రజలు పలు సమస్యలపై సర్కిల్ కార్యాలయానికి వస్తుండటంతో వాహనాల రద్దీ నిత్యం కొనసాగుతుంది.....అధికారులు చొరవచూపి కీసరలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలని అంటున్నారు....

భారతీయ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు-బిర్స ముండా

బిర్స ముండా 151 వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళి తుడుందెబ్బ ఆదివాసీ నాయకులు



ప్రజా వాయిస్,కొత్తగూడ

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలనపై ఉక్కుపిడికిలి బిగించి, గిరిజన హక్కుల కోసం పోరాడిన మహోన్నత విప్లవకారుడు, ఆదివాసీల ఆరాధ్య దైవం "ధర్తి ఆబా" బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.
అనంతరం ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ...

జననం - నేపథ్యం:

బిర్సా ముండా 1875 నవంబర్ 15న నాటి బెంగాల్ ప్రెసిడెన్సీ (ప్రస్తుత జార్ఖండ్) పరిధిలోని ఖుంటీ జిల్లా ఉలిహాతు గ్రామంలో సుగుణ ముండా, కర్మి హాతు దంపతులకు జన్మించారు. 19వ శతాబ్దం చివరలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భూమి మరియు హక్కులను కాపాడుకోవడానికి ఆయన సాగించిన పోరాటం స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో స్వర్ణక్షరాలతో లిఖించబడింది.బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా బెంగాల్ ప్రెసిడెన్సీ లో ముండ రాజ్యస్థాపన కోసం సాయుధ పోరాట విప్లవ సమరశంఖాన్ని పూరించిన బీర్సముండా భారతదేశం గర్వించదగ్గ ఆదివాసి స్వతంత్ర సమరయోధుడు. ఆయన బీహార్ గిరిజన ప్రాంతాల్లో బిర్స కొండల్లో (1886-1894)విప్లవోద్యమాన్ని ప్రారంభించాడు.బీర్సా ముండా 24 ఏళ్ళ యువ వయసులో భూమికోసం భుక్తి కోసం ఆదివాసుల అటవీ హక్కుల కోసం స్వయంపాలన అనే నినాదంతో బ్రిటిష్ పాలనను అంతం చేయడమే లక్ష్యంగా ఉద్యమాలు సాగించాడు.

ఉద్యమం - చారిత్రాత్మక నినాదం:

ముండా తెగకు చెందిన బిర్సా ముండా, గిరిజనులను మత మార్పిడుల నుంచి, దళారులు మరియు వడ్డీ వ్యాపారుల శ్రమదోపిడీ నుంచి రక్షించడానికి విశేష కృషి చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన ఇచ్చిన "అబువా రాజ్ ఏతేజన, మహారాణి రాజ్ టుండూ జన" (రాణి రాజ్యాన్ని అంతం చేద్దాం - మన రాజ్యాన్ని స్థాపిద్దాం) అనే నినాదం ఆదివాసీలలో నూతన చైతన్యాన్ని రగిలించింది. గిరిజన సంస్కృతి పరిరక్షణకు, బానిసత్వ విముక్తికి ఆయన నడిపిన 'మిలినేరియన్ ఉద్యమం' తో బ్రిటిష్ పాలకుల గుండెల్లో తడ పుట్టించడమే కాకుండా నిద్ర లేకుండా చేశాడు.



బిర్సముండా తిరుగుబాటుకు కారణాలు

ఆదివాసీల సాంస్కృతి సంప్రదాయాలు విచ్ఛిన్నం చేయడం ఆదివాసీ రైతుల భూమి వ్యవస్థను ధ్వంసం చేయడం స్థానిక బ్రిటిష్ అధికారులు అన్యాయమైన ఆదివాసుల భూమి కబ్జా చేయడం బ్రిటిష్ క్రైస్తవ మిషనరీల ద్వారా ఆదివాసులను బలవంతంగా మతం మారాలని హింసించడం భయభ్రాంతులను గురిచేయడం.

సాహసోపేతమైన పోరాటం - అమరత్వం

స్వల్ప వ్యవధిలోనే ఆదివాసీలందరినీ ఏకం చేసి, బ్రిటిష్ సైన్యానికి సవాలు విసిరిన బిర్సా ముండాను బ్రిటిష్ ప్రభుత్వం బంధించి రాంచీ జైలులో ఉంచింది. 1900 జూన్ 9న తన 25వ ఏటనే ఆయన జైలులోనే విప్లవ అమరుడయ్యారు. అతి పిన్న వయస్సులోనే ఆయన చేసిన త్యాగం నేటికీ దేశవ్యాప్తంగా ఆదివాసీలకు, యువతకు గొప్ప ప్రేరణగా నిలుస్తోంది.బిర్సా ముండా పోరాటం ఆదివాసీ ప్రజల కోసం బిర్స ముండా చేసిన త్యాగం నేటికీ ఆదివాసి ప్రాంతాల్లోనే కాక భారత దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయింది.చిరస్మరణీయ గౌరవాలు.బిర్సా ముండా పోరాటానికి గుర్తింపుగా మరియు ఆయన స్మృత్యర్థం భారత ప్రభుత్వం అనేక గౌరవాలను ప్రకటించింది.ఆయన జయంతి రోజునే (నవంబర్ 15, 2000) ప్రత్యేక జార్ఖండ్ రాష్ట్రం ఆవిర్భవించింది.1988లో భారత తపాలా శాఖ బిర్సా ముండా గుర్తుగా ప్రత్యేక తపాలా బిళ్ళ (స్టాంప్) విడుదల చేసింది.భారత పార్లమెంట్ మ్యూజియంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి అత్యున్నత గౌరవాన్ని అందించారు.రాంచీలోని అంతర్జాతీయ విమానాశ్రయం, సింద్రీలోని బిర్సా ముండా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పురూలియాలోని సిధో కాన్హో బిర్సా విశ్వవిద్యాలయం, కాన్పూరులోని బిర్సా ముండా వనవాసి ఛత్రవాస్ ఆయన పేరుమీదే నెలకొల్పబడ్డాయి.ప్రపంచంలోనే అతిపెద్ద హాకీ స్టేడియం అయిన రూర్కెలాలోని "బిర్సా ముండా అంతర్జాతీయ హాకీ స్టేడియం" ఆయన పేరు మీద నిర్మించడం జరిగింది.అలాగే మొదలగు వాటినీ నిర్మించబడటం గర్వకారణం.జల్, జంగల్, జమీన్ కోసం పోరాడి అమరుడైన బిర్సా ముండా ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు కుంజ నర్సింగ రావు పూనేం సందీప్ కుమార్ మల్లెల సారయ్య సిద్దబోయిన భాస్కర్ ఎ ఎస్ పి, వజ్జ సారయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపతి తిరుపతి బి ఆర్ ఎస్ నాయకులు వట్టం శ్రీను బాబు సర్పంచ్ కంగాల నాగేశ్వర్ రావు వార్డ్ మెంబర్ సొలం వెంకన్న ముసలమ్మా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ సిద్దబోయిన భద్రయ్య మల్లెల లక్ష్మన్ తాటి సుదర్శన్ పులి ప్రకాష్ ఆదివాసీ ఉద్యోగులు ఏంపల్లి సమ్మయ్య తాటి సూరయ్య వాసం కేషేశీదర్ మద్దెల సుదర్శన్ అలెం సాంబయ్య మోకాళ్ళ గిరిబాబు మోకాళ్ళ వెంకన్న తదితరులు పాల్గొని ఘనంగా నివాళిలు అర్పించారు.

వన్నిగూడాలో స్మశానవాటిక కరువు!

గ్రామంలో ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి స్థలం కూడా లేదు..

గోరి కట్టడం దేవుడెరుగు....

ఏళ్ల తరబడి తీరని సమస్య..

వన్నీగూడ ప్రజల ఆవేదన పట్టించుకునేదెవరు?

ప్రజావాయిస్, కీసర :

కీసర అనుబంధ గ్రామం వన్నిగుడా....ఒక వ్యక్తి మరణిస్తే గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం ప్రతి ఒక్కరి కనీస హక్కు. కానీ కీసర మండల పరిధిలోని వన్నిగూడా గ్రామ ప్రజలకు ఆ హక్కు కూడా అందని పరిస్థితి నెలకొంది. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాన్ని ఖననం చేయడానికి సరైన స్థలం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చనిపోయిన వ్యక్తికి గోరి కట్టడం దేవుడెరుగు.. కనీసం అంత్యక్రియలు నిర్వహించడానికి స్థలం కూడా లేని దుస్థితి గ్రామంలో నెలకొంది.ఏళ్ల తరబడి స్మశాన వాటిక సమస్య కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జనాభా పెరుగుతున్నా, కనీస అవసరమైన స్మశాన వాటిక సౌకర్యం కల్పించడంలో జాప్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.గతంలోనూ గ్రామస్తులు స్మశాన వాటిక కోసం అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి స్మశాన వాటికకు కేటాయించాలని, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ప్రహరీ గోడ, అంతర్గత రహదారి,మరుగుదొడ్లు, స్నానపు గదులు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తారా? వన్నిగూడా గ్రామానికి స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తారా? లేక గ్రామస్తుల ఎదురుచూపులు ఇలాగే



నల్లగొండ గడ్డపై ఎర్రజెండా గర్జన!

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రపై రాజకీయ రగడ
మతపోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి
కార్పొరేట్లకు కేంద్రం అండ.. రైతులకు అన్యాయమంటూ బృందా కారత్ ధ్వజం
మహిళా రైతులకు గుర్తింపు.. భూమిలేని పేదలకు భూమి ఇవ్వాలని డిమాండ్

















ప్రజా వాయిస్ ‌, నల్లగొండ

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఎవరి రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించవద్దని, ఆ పోరాట వారసత్వాన్ని కాపాడుకోవాలని మాజీ ఎంపీ, ఐద్వా జాతీయ నాయకురాలు బృందా కారత్ పిలుపునిచ్చారు. నాడు భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఎర్రజెండా నాయకత్వంలో సాగిన పోరాటాన్ని మతపరమైన ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. నల్లగొండ గడ్డపై జరిగిన రైతాంగ పోరాటం భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన చారిత్రక ఉద్యమమని స్పష్టం చేశారు. ఆదివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 36వ అఖిల భారత కిసాన్ సభ మహాసభల బహిరంగ సభలో ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

పోరాట చరిత్రపై రాజకీయ వివాదం!

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నిజాం పాలన, భూస్వామ్య దేశ్‌ముఖ్‌ల దోపిడీ, రజాకార్ల అండతో కొనసాగిన వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిందని బృందా కారత్ గుర్తుచేశారు. మూడు వేలకుపైగా గ్రామాలను భూస్వామ్య బంధనాల నుంచి విముక్తి చేయడంలో ఈ పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. దున్నేవాడికి భూమి దక్కాలనే లక్ష్యంతో సాగిన ఉద్యమంలో దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం వంటి నాయకులు చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. నాలుగు వేల మంది అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ లాల్‌సలాం ప్రకటించారు.ఈ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆమె ఆరోపించారు. వాస్తవానికి అది భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన లౌకిక రైతాంగ ఉద్యమమని పేర్కొన్నారు. చరిత్రను మతతత్వ రాజకీయాలకు వాడుకునే ప్రయత్నాలను ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు. దీంతో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వంపై మరోసారి రాజకీయ చర్చకు తెరలేచింది.

కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతా?

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు రైతుల కంటే కార్పొరేట్ సంస్థలకే ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని బృందా కారత్ విమర్శించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు సాగించిన ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించిందని గుర్తుచేశారు. అయినప్పటికీ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ సంస్థల ప్రాబల్యాన్ని పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల దేశీయ రైతాంగానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతో చర్చించకుండా ఇలాంటి ఒప్పందాలపై ముందుకు వెళ్లడం సరికాదని, ఆ ఒప్పందాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదానీ వంటి కార్పొరేట్ సంస్థలు భారీ లాభాలు ఆర్జిస్తుంటే రైతులకు ఏడాదికి రూ. 6 వేల సాయం అందించి గొప్పలు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

రైతు ఆత్మహత్యలకు బాధ్యత ఎవరిది?

దేశంలో వ్యవసాయ సంక్షోభం తీవ్రంగా ఉందని, గత 12 ఏళ్లలో లక్షన్నర వ్యవసాయ సంబంధిత ఆత్మహత్యలు నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలను ప్రస్తావించారు. కరువు, వరదలు, పంట నష్టాలు, అప్పుల భారం రైతులను కుంగదీస్తున్నాయని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, పంట నష్టాలకు పూర్తిస్థాయి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీమా కంపెనీల లాభాల కంటే రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి వ్యవసాయ కార్మికులకు పని కల్పించాలని కోరారు.

మహిళా రైతులకు గుర్తింపు ఏదీ?

వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో వారికి రైతులుగా గుర్తింపు దక్కడం లేదని బృందా కారత్ విమర్శించారు. మహిళలను కుటుంబ సహాయకులుగా మాత్రమే పరిగణించడం అన్యాయమన్నారు. మహిళా రైతులకు భూమిపై హక్కులు కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాల్లో సమాన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూమి కొద్దిమందికేనా.. పేదలకు ఎప్పుడు?

భూమి పంపిణీలో అసమానతలు పెరుగుతున్నాయని, భూగరిష్ట పరిమితి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆమె కోరారు. భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయడంతోపాటు సమగ్ర భూసంస్కరణలు చేపట్టాలన్నారు. అప్పుల కారణంగా చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోతున్న పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు.అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో రైతులను నిర్వాసితులను చేయవద్దని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని కోరారు. ఆదివాసీల అటవీ హక్కులను కాలరాయకుండా పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామసభల అధికారాలను గౌరవించాలని, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఎర్రజెండా పోరాటానికి నల్లగొండ మరో వేదిక

రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల హక్కుల కోసం కిసాన్ సభ తొమ్మిది దశాబ్దాలుగా పోరాడుతోందని బృందా కారత్ పేర్కొన్నారు. ఎర్రజెండా కేవలం రాజకీయ గుర్తు కాదని, సమానత్వం, సామాజిక న్యాయం, శ్రమజీవుల హక్కుల కోసం సాగుతున్న పోరాటానికి ప్రతీక అని అన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రకు వేదికైన నల్లగొండలో 36వ అఖిల భారత కిసాన్ సభ మహాసభలు జరగడం చారిత్రక ప్రాధాన్యత కలిగిన పరిణామమని పేర్కొన్నారు.

మహిళల ఆసక్తికి కౌన్సిలర్ లావురి అరుణ సుధాకం ప్రోత్సాహం..కోలాట కళకు పునర్జీవం..

5వ వార్డులో కోలాటం సాధనకు ప్రత్యేక స్థలం ఏర్పాటు..
మహిళల అభ్యర్థనకు తక్షణ స్పందన
నాని మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ.. సంప్రదాయ కళల పరిరక్షణకు కౌన్సిలర్ చొరవ

ప్రజా వాయిస్ ‌, మిర్యాలగూడ

అంతరించిపోతున్న సంప్రదాయ జానపద కళలను కాపాడటంతో పాటు మహిళల్లో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు మిర్యాలగూడ పట్టణం 5వ వార్డు కౌన్సిలర్ లావురి అరుణ సుధాకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మహిళల ఆసక్తికి ప్రోత్సాహం అందిస్తూ కోలాటం నేర్చుకునేందుకు అవసరమైన వసతులు కల్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు.వార్డుకు చెందిన మహిళలు కోలాటం నేర్చుకోవాలనే ఆసక్తితో సాధన చేసుకునేందుకు తగిన స్థలం ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ లావురి అరుణ సుధాకర్‌ను కోరారు. మహిళల అభ్యర్థనపై వెంటనే స్పందించిన ఆమె వార్డులోనే కోలాటం సాధనకు అనువైన స్థలాన్ని గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో మహిళలు ఉత్సాహంగా కోలాటం నేర్చుకుంటున్నారు.నాని మాస్టర్ ఆధ్వర్యంలో మహిళలకు కోలాటంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కోలాటంలోని వివిధ పద్ధతులు, అడుగులు, లయబద్ధమైన కదలికలను నేర్పిస్తూ కళలో ప్రావీణ్యం సంపాదించేలా తీర్చిదిద్దుతున్నారు.ప్రజాప్రతినిధిగా కేవలం వార్డు సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా మహిళల అభిరుచులు, ఆసక్తులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు లావురి అరుణ సుధాకర్ తీసుకుంటున్న చొరవ అభినందనీయంగా నిలుస్తోంది. మహిళలు అడిగిన వెంటనే స్థలం ఏర్పాటు చేయడం, వారికి శిక్షణ అందించేలా ప్రోత్సహించడం ఆమెకు మహిళల పట్ల ఉన్న ప్రోత్సాహక దృక్పథాన్ని చాటుతోంది.ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా కనిపించిన కోలాటం నేడు ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో మహిళలు ముందుకొచ్చి ఈ కళను నేర్చుకోవడం విశేషం. మహిళల ఆసక్తి, కౌన్సిలర్ లావురి అరుణ సుధాకర్ సహకారం, నాని మాస్టర్ శిక్షణ తోడవడంతో 5వ వార్డులో సంప్రదాయ కళకు మళ్లీ కొత్త ఊపిరి పోస్తున్నారు.





ప్రజా వాయిస్